సోమవారం
26-12-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 184
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం



దేశ రాజకీయ యవనికపై విప్లవ కెరటమై ఎగసిన అరుణకేతనం.. త్యాగాలతో పునీతమై పోరాటాలతో పదునెక్కిన కష్టజీవుల ఆయుధం.. ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకవర్గంపై నిరంతరం పోరాటాల బావుటాగా జనం గుండెల్లో చెరగని ముద్రవేసుకుని దున్నేవాడికే భూమి నినాదంతో లక్షలాది ఎకరాలు పేదలకు పంపిణీ చేయడం, బ్యాంకుల జాతీయకరణలో కీలక భూమిక వహించిన, ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటులో అగ్రగామిగా నిలిచిన

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)

98వ వ్యవస్థాపక దినోత్సవం నేడు

ముందస్తుకే మొగ్గు!

- అంతర్గతంగా ఎన్నికల సన్నాహాల్లో వైసీపీ
- అభ్యర్థుల ఎంపికపై సర్వే ప్రక్రియ వేగవంతం
- 2024 వరకు ఆగితే వ్యతిరేకత పెరుగుతుందని అంచనా
- తెలంగాణతో పాటు ఎన్నికలకు సన్నద్ధం
- వచ్చే ఏడాది మార్చి తర్వాత అసెంబ్లీ రద్దు?

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముందుగానే జరిగే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గతంలో తెలంగాణ సీఎం కేసీఆర్ తరహాలో వచ్చే ఏడాది మార్చి తర్వాత అసెంబ్లీ రద్దు చేసి, పొరుగున ఉన్న తెలుగు రాష్ట్రంతోపాటు ఎన్నికలకు వెళ్లడం మంచిదనే ఆలోచనలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఆర్థిక ఇబ్బందులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో గడువు ప్రకారం 2024 వరకు ఎన్నికల కోసం వేచి ఉండడం మంచిది కాదనే అభిప్రాయం ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. ఈ నెలలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలివ్వడమే ఇబ్బందిగా మారింది. 20వ తేదీ తర్వాత కూడా చాలా మంది ఉద్యోగులకు వేతనాలు చెల్లించిన పరిస్థితి ఉంది. మరోపక్క అప్పులు పుట్టడం లేదు. చేసిన అప్పులకు నెలవారీ వడ్డీ చెల్లింపులు భారంగా మారుతున్నాయి. ఎఫ్ఆర్‌బీఎం చట్ట పరిమితిని మించి అప్పులు చేయడంతో కేంద్ర సహకారం కూడా కొరవడుతోంది. గత మూడున్నరేళ్లలో రికార్డుస్థాయిలో దాదాపు 6లక్షల కోట్లు పైగా అప్పులు చేసినట్లు ప్రతిపక్షం లెక్కలతో సహా బయట పెట్టింది. వీటి వడ్డీకే నెలవారీ మళ్ళీ అప్పు చేయాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఇక కాంట్రాక్టర్లకు బిల్లులు భారీమొత్తంలో బకాయిలున్నాయి. రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యుటీలు, పీఎఫ్‌లు కూడా పెద్దమొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయి. దీనినుంచి బయట పడేందుకే వారి పదవీ విరమణ వయస్సు కూడా మరో రెండేళ్లు పెంచినట్లు ప్రభుత్వ ఉద్యోగులు చెపుతున్నారు. 2024వరకు ఎన్నికలకు ఆగితే రిటైరయ్యే ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉంటారు. వీరికి పెన్షన్, గ్రాట్యుటీ, పీఎఫ్‌లు చెల్లించే పరిస్థితి రాష్ట్ర ఖజానాకు లేదు. అందువల్ల ముందస్తు ఎన్నికలకు వెళ్ళడమే శ్రేయస్కరమనే భావనకు వైసీపీ అధిష్ఠానం వచ్చింది.

ప్రతిపక్షాల యాత్రలకు బ్రేక్!

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ జనవరి నుంచి సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రతిపక్షాలపై అక్రమ కేసుల బనాయింపు, తారాస్థాయికి చేరిన అప్పులు,అవినీతి, అమరావతి రాజధాని విధ్వంసం, రాష్ట్రానికి కీలకమైన పోలవరం ప్రాజెక్టు పూర్తికాకపోవడం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, విభజన అంశాల సాధనలో రాజీ ధోరణి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో లోపాయికారీ ఒప్పందం, అభివృద్ధిలో పూర్తిస్థాయిలో కుంటుపడటం వంటి అంశాలను లోకేష్ ప్రజలకు నేరుగా వివరించి చైతన్యవంతులను చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోపక్క జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటించేందుకు 'వారాహి' పేరుతో యుద్ధ వాహనాన్ని సిద్ధం చేసుకున్నారు. ఇక టీడీపీ అధినేత చంద్రబాబు కూడా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఒకేసారి ఎన్నికలు జరిగితే రెండు రాష్ట్రాల్లో పర్యటించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల ఆయనపై ఒత్తిడి పెరగడంతోపాటు, ఏపీలో పర్యటించే సమయం తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఇలా ఏ విధంగా చూసినా ముందస్తు ఎన్నికలకు వెళ్లడం ద్వారా ప్రతిపక్షాల ఎన్నికల ప్రచార ఎత్తుగడలను తిప్పికొట్టవచ్చనే యోచనలో వైసీపీ ఉంది.

బీజేపీపై వ్యతిరేకతను తప్పించుకునే అవకాశం

ముందస్తు ఎన్నికలకు వెళ్లడం ద్వారా బీజేపీపై ఉన్న వ్యతిరేకతను తప్పించుకునే అవకాశం ఏర్పడుతుందని అధికారపార్టీ భావిస్తోంది. ఏపీకి తీవ్ర అన్యాయం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం అంటకాగుతున్న విషయం అందరికీ తెల్సిందే. ఎంపీలను ఎక్కువమందిని గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని గత ఎన్నికల్లో ప్రగల్భాలు పలికిన జగన్‌మోహన్ రెడ్డి, హోదా కాదు కదా...విభజన అంశాల్లో ఏ ఒక్కటీ గత మూడున్నరేళ్లలో సాధించలేకపోయారు. పైగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో తెచ్చిన కాశ్మీర్‌లో 370 రద్దుతోపాటు, సీఏఏ, రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలతోపాటు, అనేక వివాదస్పద బిల్లుల ఆమోదానికి వైసీపీ పూర్తిస్థాయిలో సహకరించింది. ముస్లింలతోపాటు, కార్మిక, కర్షక వర్గాలన్నీ కేంద్రంలోని బీజేపీపై, దానికి సహకరించిన వైసీపీపై ఇప్పటికీ పూర్తి వ్యతిరేకతతో ఉన్నారు. నిర్దిష్ట సమయం ప్రకారం సార్వత్రిక ఎన్నికలకు వెళితే బీజేపీపై ఆయా వర్గాలకు ఉన్న వ్యతిరేకత తమపై పడే అవకాశం ఉందని వైసీపీ నేతలు భయపడుతున్నారు. ఇలా అన్నికోణాల్లో సుదీర్ఘ కసరత్తు నిర్వహించిన వైసీపీ అధిష్టానం...అన్నివిధాలా ముందస్తు ఎన్నికలకు వెళ్లడమే శ్రేయస్కరమన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ వేగవంతం

పార్టీలో అంతర్గతంగా సాగుతున్న అభ్యర్థుల ఎంపిక సర్వే కూడా దీనికి బలం చేకూరుస్తోంది. 2019 ఎన్నికల్లో వైసీపీ విజయానికి కారణమైన వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ టీమ్ ఇచ్చిన సర్వేతోపాటు, సీఎం జగన్ తన సొంత మీడియాతో, ఇంటిలిజెన్స్ వర్గాలతో సేకరించిన సర్వేల ప్రకారం రాబోయే ఎన్నికల్లో గెలుపు గుర్రాల ఎంపిక

- మిగతా 2 లో

నేపాల్ కొత్త ప్రధాని ప్రచండ

నేడే ప్రమాణ స్వీకారం

ఖాట్మండు: నేపాల్‌లో రాజకీయ పరిణా మాలు చకాచకా మారిపోయాయి. నూతన ప్రధానిగా పుష్ప కమల్ దహల్ 'ప్రచండ' ఆదివారం నియమితులయ్యారు. సీపీఎన్-మావోయిస్టు సెంటర్ పార్టీ చైర్మన్ ప్రచండను ప్రధానమంత్రిగా నియమిస్తున్నట్లు దేశాధ్యక్షు రాలు విద్యాదేవి భండారి ప్రకటించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 76, క్లాజు 2 ప్రకారం ఈ నియామకం జరిగినట్లు అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. సోమవారం సాయంత్రం 4 గంటలకు కొత్త ప్రధానిగా ప్రచండ ప్రమాణస్వీకారం చేస్తారని పేర్కొంది. దీంతో ఆయన మూడవసారి ప్రధాని పీఠాన్ని అధిష్టించనున్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు విధించిన గడువు ముగిసే క్రమంలో ప్రచండ (68) అధ్యక్ష కార్యాలయానికి వెళ్లారు. తనను ప్రధానిగా నియమించాలని కోరారు. ప్రచండకు సీపీఎన్-యూఎంఎల్ చైర్మన్ కేపీ శర్మఓలీతో పాటు రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్‌పీ) అధ్యక్షుడు రవి లమిచ్ఛనె, రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ అధ్యక్షుడు రాజేంద్ర లింగెడెన్ మద్దతిచ్చారు. వీరంతా కలిసి అధ్యక్షభవన్‌కు వెళ్లి ప్రధానిగా ప్రచండ పేరును ప్రతిపాదించారు. దీంతో నేపాల్ కొత్త ప్రధాని ప్రచండ (68) నియమితులయ్యారు. ఆయనకు ప్రతినిధుల సభలోని మొత్తం 275కు గాను 65 మంది సభ్యులు మద్దతిచ్చారు. వీరంతా తమ సంతకాలతో లేఖను కూడా అధ్యక్షురాలికి పంపారు. ఆమె ఆమోదంతో ప్రచండ నేపాల్‌కు ప్రధానిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. ఇదిలావుంటే, నేపాలీ కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమిలో చీలికకు ప్రధాని కావాలని ప్రచండ కోరుకోవడమే కారణం. ఏకాభిప్రాయం కుదరక కూటమి నుంచి మావోయిస్టు సెంటర్ నిష్క్రమించింది. కాగా, ఆదివారం ఉదయం బాల్కోట్‌లోని మాజీ ప్రధాని ఓలీ నివాసంలో పార్టీల అగ్రనేతల కీలక భేటీ జరిగింది. నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ డ్యూబాకు ప్రచండకు మధ్య జరిగిన చర్చలూ ఫలించలేదు. స్పీకర్ పదవి ఇస్తామంటే ప్రచండ ఒప్పుకోలేదు. దీంతో షేర్ బహదూర్ డ్యూబా మరోసారి ప్రధాని పగ్గాలు చేపడతారని భావించిన సమయంలో ప్రచండ తన పేరును ప్రతిపాదించడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి.

టాలీవుడ్‌లో మరో విషాదం

సీనియర్ నటుడు చలపతిరావు హఠాన్మరణం

విశాలాంధ్ర-హైదరాబాద్: టాలీవుడ్‌లో మరోసారి విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నటుడు చలపతిరావు (78) హఠాన్మరణం చెందారు. ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. 1944 మే8న కృష్ణాజిల్లా బల్లిపర్రులో చలపతిరావు జన్మించారు. 1200కు పైగా చిత్రాల్లో వివిధ పాత్రల్లో ఆయన నటించారు. నిర్మాతగానూ గుర్తింపు పొందారు. రెండు రోజుల క్రితమే సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణ మృతిచెందగా... ఇప్పుడు చలపతిరావు ఆకస్మిక మరణంతో టాలీవుడ్ చిత్రపరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. చలపతిరావుకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు రవిబాబు దర్శకుడు, నటుడు, నిర్మాతగా ఉన్నారు. నటుడు, నిర్మాతగా చలపతిరావు గుర్తింపు పొందారు. 1966లో 'గూఢచారి 116' సినిమాతో ఆయన చిత్రపరిశ్రమలో అడుగుపెట్టారు. కలియుగ కృష్ణుడు,

- మిగతా 2 లో

అవ్వా...తాత

పింఛన్లకు ఎసరు?

- ముందస్తు నోటీసులతో ఆందోళన
- అడ్డగోలు ఆంక్షలతో ఖంగుతింటున్న లబ్ధిదారులు
- లబోదిబోమంటున్న ఒంటరి మహిళలు, దివ్యాంగులు
- ఇల్లే లేకపోయినా విద్యుత్ మీటర్లున్నాయని నోటీసు
- తలరాత మార్చడమంటే నోటివద్ద ముద్ద లాగేయడమా?


(THIS NOTICE SYSTEM GENERATED,SIGNATURE NOT REQUIRED)

సామాజిక భద్రత పింఛన్ల ఎగవేతకు వైసీపీ ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టు కనబడుతోంది. బతుకుదెరువుకు భరోసా కల్పిస్తున్న వృద్ధుల పింఛన్‌పైనే కన్నుపడింది. అవ్వా, తాతా అంటూ ముద్దుముద్దుగా పిలుస్తూనే పుట్టినరోజు కేక్ కట్ చేసినంత సునాయాసంగా పింఛన్లలో కోత విధించడంతో పింఛన్‌దారులు ఖంగుతిన్నారు. న్యాయసమ్మతం కాని ఆంక్షలను భూతద్దంతో వెదికి పింఛన్ నిలిపివేయబడుతుందని లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వడంతో లబోదిబోమంటున్నారు. ఇల్లు లేకపోయినా మూడు విద్యుత్ మీటర్లు ఉన్నాయనీ, 300 యూనిట్లు పైబడి బిల్లు వస్తుందని లేనివి ఉన్నట్టు నోటీసులో పేర్కొనడంతో నెత్తీనోరు కొట్టుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా పింఛన్ పొందుతున్న తాము... అడ్డగోలు నిబంధనలతో పింఛన్ కోల్పోతే తాము బతికేదెలా? తమను ఎవరు ఆదరిస్తారని ఆవేదన చెందుతున్నారు. తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకుంటాడని ఓట్లేసి గెలిపిస్తే తమ నోటికాడ ముద్ద లాగేసేలా జగన్ పాలన సాగిస్తున్నాడని మండిపడుతున్నారు.

2 లో

అబద్ధాల మోదీ

- అహ్మదాబాద్‌లో 2002 నాటికి ఒకే విశ్వవిద్యాలయం ఉన్నట్టు ప్రకటన
- ఫ్యాక్ట్‌చెక్‌లో అసత్యమని వెల్లడి

న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన గుజరాత్ ఎన్నికల ప్రచార సభల్లో సొంత డబ్బా కొట్టుకోవడానికి ప్రధాని మోదీ పచ్చి అబద్ధాలు చెప్పి అడ్డంగా దొరికిపోయారు. గత నెల 24న అహ్మదాబాద్ ఎన్నికల ప్రచార సభలో తన వల్లే గుజరాత్ ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పడానికి ప్రజలను తప్పుదోవ పట్టించారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు అంటే 2002 సమయంలో అహ్మదా బాద్‌లో కేవలం ఒకే ఒక విశ్వవిద్యాలయం ఉండేదని, కానీ ప్రస్తుతం జిల్లాలో 23 విశ్వవిద్యాలయాలు ఉన్నాయని, అది తన ఘన కీర్తే

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మన ప్రభుత్వం సాధించిన అపజయాలను విజయాలుగా మీడియాలో చెబుతాం!

కేంద్రం వైఖరికి నిరసన

విశాఖలో 'ప్రజాగర్జన'

జనవరి 27న బహిరంగసభకు హాజరు కానున్న లక్షల మంది 3లో

సాగుకు ముప్పే

- వాతావరణ మార్పులతో వ్యవసాయానికి ప్రమాదం
- మరో 20 ఏళ్లలో 12 శాతం తగ్గనున్న ధాన్యం ఉత్పత్తి, పంట నాణ్యత
- జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ వెల్లడి
- ఆందోళన చెందుతున్న రైతులు

న్యూఢిల్లీ: దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇదే సమయంలో వ్యవసాయానికి ముప్పు పొంచి ఉందని జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐకార్) హెచ్చరించింది. ఇది రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ విధానాలు వ్యవసాయాన్ని సంక్షోభంలోకి

- మిగతా 2 లో

'బాంబ్' టెర్రర్...

- అమెరికాలో 28కి చేరిన మృతుల సంఖ్య..
- 13 రాష్ట్రాలపై మంచుతుపాను ప్రభావం
- 17లక్షల ఇళ్లకు కరెంట్ కట్
- క్రిస్మస్ వేడుకలకు ఆటంకం

వాషింగ్టన్: అమెరికాలో బాంబ్ తుపాను బీభత్సం కొన సాగుతోంది. మంచుతుపాను కారణంగా చనిపోయిన వాళ్ల సంఖ్య 28కి చేరుకుంది. ఉష్ణోగ్రతలు మైనస్ 45 డిగ్రీలకు పడిపోవడంతో ప్రజలు అల్లాడి పోతున్నారు. చాలా ప్రాంతాల్లో ఇళ్ల నుంచి బయటకు అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో దాదాపు 17 లక్షల ఇళ్లు, వ్యాపార సంస్థలు అంధకారంలోకి చిక్కుకున్నాయి. 13 రాష్ట్రాలపై బాంబ్ సైక్లోన్ ప్రభావం ఉంది. ఈ పరిస్థితుల్లో పవర్ ప్లాంట్‌లను నడపడం కష్టసాధ్యంగా ఉందని మేజర్ గ్రిడ్ అధికారులు తెలిపారు. దేశంలోని 60 శాతం మందిపై ఈ మంచు తుఫాను ప్రభావం పడింది. దేశవ్యాప్తంగా 5,700 విమానాలను రద్దు చేశారు. 7,100 విమానా సర్వీసులు ఆలశ్యంగా నడిచాయి. డెట్రాయిట్, చికాగో, మినాయాపోలిస్, డెన్వర్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. అనేకచోట్ల రోడ్లపై మంచు పేరుకుపోవడంతో ఆయా రహదారులను మూసివేశారు. క్రిస్మస్ సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోవడంతో ఫ్లోరిడా, మేరిలాండ్, న్యూజెర్సీ, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, కెంటకీ తదితర ప్రాంత ప్రజలు వేడుకలకు దూరంగా ఉన్నారు. శనివారం దేశవ్యాప్తంగా వేలాది మంది విమాన ప్రయాణికులు విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారని న్యూయార్క్ పోస్ట్ తెలిపింది. దశాబ్దాలలో అత్యంత భయంకరమైన తుపానుగా బాంబ్ సైక్లోన్ పరిణమించింది. లక్షల మంది తమ ప్రయాణాలు రద్దు చేసుకున్నారు. అతిశీతాకాల వాతావరణం కారణంగా నిరాశ్రయులైన వారికి తాత్కాలిక ఆశ్రయాన్ని కల్పించేందుకు స్థానిక గ్రంథాలయాలు, పోలీసు స్టేషన్లను ఉపయోగిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్

వాటికన్: ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్ని చర్చిల్లో వేడుకలు వైభవంగా జరిగాయి. చర్చీలు రంగురంగుల విద్యుత్ దీపాలు, బెలూన్లు, స్టార్లతో మెరిసిపోయాయి. భారీ క్రిస్మస్ ట్రీ, క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని భక్తుల కళ్లకుకట్టేలా పశువుల పాకను ఏర్పాటు చేశారు. వాటికన్ సిటీలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకలకు భారీగా జనం హాజరయ్యారు. పోప్ ప్రత్యేక సందేశం ఇచ్చారు. ధనదాహం వద్దని పేదలు, అవసరార్థులకు ఆపన్నహస్తం అందించాలని పిలుపునిచ్చారు. జీసెస్ కూడా పేద కుటుంబంలో జన్మించారని గుర్తుచేశారు. ఆయన చివరి వరకు పేదోడిగానే ఉన్నారని చెప్పారు. ఈసారి క్రిస్మస్ సందర్భంగా పేదలు, అవసరార్థులకు అండగా నిలుస్తామని ప్రతి ఒక్కరు ఎవరికివారు ప్రతిజ్ఞచేసుకోవాలని పోప్ సూచించారు. 'ఇప్పటి వరకు మనం ఎన్ని యుద్ధాలు చూశాం... ఎన్ని చోట్ల చూశాం.. ఇప్పటికీ యుద్ధం జరుగుతూనే ఉన్నది (ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ఉద్దేశిస్తూ). మానవులకు గౌరవపదంగా జీవించే పరిస్థితులు లేవు. స్వేచ్ఛకు విఘాతం కలుగుతూనే ఉన్నది. హక్కులను కాలరాస్తూనే ఉన్నారు. ధనదాహార్తి విడనాడటం మానవులకు ఎంతో ముఖ్యం. తోటి మానవులను ప్రేమించడం నేర్చుకోవాలి. చుట్టుపక్కల వారితో కలిసి మెలిసి జీవించాలి. అవసరం ఉన్న వారికి చేతనైనా సాయం చేయడం ఉత్తమ లక్షణం. ఆకలి అన్న వాడికి అన్నం పెట్టడం ధర్మం' అని క్రిస్మస్ సందర్భంగా పోప్ హితవు పలికారు.

పేలిన గ్యాస్ ట్యాంకర్.. 9 మంది సజీవ దహనం

జొహనెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో గ్యాస్ ట్యాంకర్ పేలి తొమ్మిది మంది సజీవ దహనమయ్యారు. బోక్స్‌బర్గ్‌లోని రైల్వే వంతెన వద్ద ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఘటనలో రెండు ఇళ్లతో పాటు కొన్ని కార్లు ధ్వంసమైనట్లు ఏబీసీ న్యూస్ పేర్కొంది.అత్యవసర సేవల అధికార ప్రతినిధి విలియం మాట్లాడుతూ 'గ్యాస్ ట్యాంకర్ సబ్‌వే వంతెన కిందకు వెళ్లి చిక్కుకుపోయింది. ఫలితంగా మంటలు చేలరేగటంతో ట్యాంకర్ పేలింది' అని అన్నారు. మంటలను అదుపు చేసినట్లు వెల్లడించారు. రెండు ఇళ్లతో పాటు రెండు ద్విచక్రవాహనాలు కాలిపోయాయని చెప్పారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. ఈ ఘటనలో ఎంత మంది గాయపడ్డారో తెలియలేదు. మృతుల సంఖ్య పెరగవచ్చు అని అధికారులు తెలిపారు.

పెరిగిన జీతాలు- కుదిరిన ఒప్పందాలు

- 80 శాతం వరకు పెంపునకు యాజమాన్యం అంగీకారం
- 40 రోజుల సమ్మె విరమించిన కాలిఫోర్నియా వర్సిటీ వర్కర్లు

లాస్ ఏంజిల్స్: వేతన పెంపుదల డిమాండుతో కాలిఫోర్నియా యూనివర్సిటీ వర్కర్లు 40 రోజుల పాటు చేసిన సమ్మె విజయవంతం అయింది. కనిష్ఠ వేతనజీవులకు 80శాతం వరకు వేతనాల్లో పెంపుదలకు యాజమాన్యం అంగీకరించింది. అలాగే ఇతరత్ర సౌకర్యాలు కల్పించేందుకు అంగీకారం తెలిపింది. దీంతో గ్రాడ్యుయేట్ విద్యార్థులు, టీచింగ్ అసిస్టెంట్లు సమ్మె విరమించినట్లు ప్రకటించారు. 'యూనివర్సిటీలో తరగతులను బహిష్కరిస్తూ 40రోజులు సాగిన సమ్మెను విరమించాం. గ్రాడ్యుయేట్ విద్యార్థులు, బోధనా సిబ్బంది రెండు కాంట్రాక్టులకు ఆమోదం తెలిపారు. కుదిరిన ఒప్పందాల ప్రకారం, కనిష్ఠ వేతనాలు ఉన్న వర్కర్లకు 80శాతం వరకు జీతాలు పెరుగుతాయి. వర్కర్లందరికీ వేతన పెంపు అమలవుతుంది' అని యూనియన్ నాయకులు తెలిపారు. సుమారు 36 వేల మంది కార్మికులు ఈ ఒప్పందాల వల్ల లబ్ధిపొందుతారని చెప్పారు. పిల్లల సంరక్షణతో పాటు ఆరోగ్య ఖర్చులు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు వెల్లడించారు. ఈ మేరకు ఒప్పందం కుదిరిందన్నారు. ఈ చర్చలకు యునైటెడ్ ఆటో వర్కర్స్ ప్రాతినిధ్యం వహించారు. కాగా వేలాదిమంది విద్యార్థులు ఐక్యంగా సమ్మె చేసిన ఫలితంగా వేతనాలు, పని పరిస్థితులు మెరుగయ్యాయని యూఏడబ్ల్యూ 2865 అధ్యక్షుడు రాఫెల్ జేమీ ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీలు తమ వర్కర్లకు ఏ విధంగా మద్దతు ఇవ్వాలన్న దానిని ఈ ఒప్పందాలు పున్ననిర్వచిస్తాయన్నారు. కొత్త ఒప్పందాలను యూనివర్సిటీ యాజమాన్యం కూడా స్వాగతించిందని యూనియన్ తెలిపింది. ఈ ఒప్పందాలను తక్షణమే అమల్లోకి తెచ్చి 2025, మే 31 వరకు అమలు చేస్తారు. తద్వారా లాస్ ఏంజిల్స్, శాన్ డియగో, బెర్కెలే వంటి ఖరీదైన నగరాల్లో ఉండి... 24వేల డాలర్ల కంటే తక్కువ వార్షిక వేతనం పొందే 36వేల మంది వర్కర్లు లబ్ధి పొందనున్నారు. 2024 చివరికి టీచింగ్ అసిస్టెంట్ల కనీస వేతనం 36వేల డాలర్లకు, గ్యాడ్యుయేట్ విద్యార్థి రీసెర్చర్లకు 40వేల డాలర్లకు పారితోషికం పెరుగుతుంది. పిల్లల సంరక్షణ కోసం అదనంగా 2వేల డాలర్లకుపైగా సెమిస్టర్ సబ్సిడీలను వర్కర్లు పొందనున్నారు.

సాగుకు ముప్పే

(మొదటిపేజీ తరువాయి)

నెట్టాయి. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర లభించక రైతులు ఆర్థిక కష్టాల్లో చిక్కుకున్నారు. సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వ అండతో కార్పొరేట్‌లు పంట ఉత్పత్తులను చేజిక్కించుకుని ప్రయోజనం పొందేందుకు తహతహలాడుతున్నారు. ఇదే సమయంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులతో సాగు ఛిద్రమవుతోంది. భారీగా విడుదలవుతున్న గ్రీన్‌హౌస్ వాయువుల కారణంగా వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకొంటున్నాయని, ఇది ఇలాగే కొనసాగితే మరో 20 ఏళ్లలో వ్యవసాయంపై భారీ ప్రతికూలత తప్పదని హెచ్చరించింది. ఇది అనేక అంశాలపై ప్రభావం చూపనుందని పేర్కొంది. వర్షాలు తగ్గి, కరువు కోరల్లో చిక్కుకోవడం ఖాయమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే అనేక జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది. వాతావరణ మార్పులు, వ్యవసాయంపై కలిగే ప్రభావంపై సర్వే చేసిన ఐకార్ తన నివేదికను తాజాగా విడుదల చేసింది. ఈ నివేదికలో అనేక కీలక విషయాలను వెల్లడించింది. వాతావరణ మార్పుల కారణంగా పంటల దిగుబడి, నాణ్యత తగ్గుతుందని పేర్కొంది. అలాగే, ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతాయని, తద్వారా వర్షపాతం తగ్గుతుందని తెలిపింది. సముద్ర మట్టం క్రమంగా పెరుగుతుందని వెల్లడించింది. తుఫానులు సర్వసాధారణం అవుతాయని, వాటి తీవ్రత కూడా భారీగా ఉంటుందని పేర్కొంది. ఫలితంగా సాగునీటి లభ్యత 20 శాతం తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

తగ్గనున్న పంటల దిగుబడి

వాతావరణంలో కలిగే మార్పులు పంట ఉత్పత్తుల దిగుబడిపై భారీ ప్రభావం చూపనున్నాయని ఐకార్ వెల్లడించింది. పంటల నాణ్యతపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని పేర్కొంది. దాదాపు అన్ని రకాల పంటలపై... మరీ ముఖ్యంగా వరి, గోధుమ, ఆలుగడ్డపై అధికంగా ఉంటుందని వెల్లడించింది. దీని ప్రకారం 2040 వరకు వరి దిగుబడిలో 12 శాతం, గోధుమ దిగుబడిలో 9 శాతం తగ్గుదల నమోదు కానుందని వెల్లడించింది. మొక్కజొన్న దిగుబడిలో 18 శాతం, ఆవాల దిగుబడి 12 శాతం, ఆలుగడ్డ దిగుబడి 13 శాతం తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

వ్యవసాయ ఆదాయంలో 30 శాతం కోత

వాతావరణ మార్పులతో సాగు, పంటల దిగుబడి తగ్గడంతో దీని ప్రభావం వ్యవసాయ ఆదాయంపై పడుతుందని ఐకార్ వెల్లడించింది. ఈ కారణాలతో 2040 వరకు వ్యవసాయం ద్వారా సమకూరే ఆదాయం 30 శాతం తగ్గనుందని అంచనా వేసింది. ఇప్పటికే రైతులకు అంతంత మాత్రంగా ఆదాయం సమకూరుతున్నది. ఇప్పుడు ఇందులోనూ కోత పడితే ఇక రైతు పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరోవైపు కేంద్రంలోని బీజేపీ సర్కారు మద్దతు ధర పెంచేందుకు, మద్దతు ధర చట్టం చేసేందుకు ససేమిరా అంటున్నది. ఈ నేపథ్యంలో ఓవైపు వాతావరణ ప్రభావం, మరోవైపు రైతులపై కేంద్రం కక్ష సాధింపుతో రైతుల కష్టాలు రెట్టింపు కావడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా వాతావరణ మార్పులు వ్యవసాయంపై తీవ్ర ప్రభావాన్ని చూపే ప్రమాదం ఉండడంతో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐకార్ సూచించింది. లేకుంటే మరిన్ని ఇబ్బందులు తప్పవని హెచ్చరించింది. ఇందులో భాగంగానే ఐకార్ అనేక సూచనలు చేసింది. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. రాష్ట్రాలవారీగా వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేయాలని సూచించింది.

చలపతిరావు హఠాన్మరణం

(మొదటిపేజీ తరువాయి)

కడప రెడ్డమ్మ, జగన్నాటకం, పెళ్లంటే నూరేళ్ల పంట తదితర సినిమాలకు చలపతిరావు నిర్మాతగా వ్యవహరించారు. ఎన్టీఆర్, కృష్ణ, నాగార్జున, చిరంజీవి, వెంకటేశ్ ఇలా ప్రముఖ హీరోలు నటించిన చిత్రాల్లో ఆయన సహాయనటుడిగా, ప్రతినాయకుడిగా నటించి అందరి ప్రశంసలు అందుకున్నారు.

సీనియర్ ఎన్టీఆర్‌తో ప్రత్యేక అనుబంధం

సీనియర్ ఎన్టీఆర్‌తో చలపతిరావుకు ప్రత్యేక అనుబంధం ఉంది. మూడు తరాల నటులతోనూ ఆయన నటించారు. యమగోల, యుగపురుషుడు, డ్రైవర్ రాముడు, అక్బర్ సలీమ్ అనార్కలి, భలే కృష్ణుడు, సరదా రాముడు, జస్టిస్ చౌదరి, బొబ్బిలి పులి, చట్టంతో పోరాటం, దొంగ రాముడు, అల్లరి అల్లుడు, అల్లరి, నిన్నే పెళ్లాడతా, నువ్వే కావాలి, సింహాద్రి, అరుంధతి, 'సింహా', 'దమ్ము', 'లెజెండ్' ఇలా ఎన్నో వందల చిత్రాల్లో ఆయన కీలకపాత్రలు పోషించారు. చివరగా ఆయన బంగార్రాజు సినిమాలో నటించారు.

బుధవారం అంత్యక్రియలు

కుమార్తె అమెరికా నుంచి వచ్చిన తర్వా త చలపతిరావు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. ఆదివారం మధ్యా హ్నం వరకు అభిమానుల సందర్శనార్థం ఆయన భౌతికకాయాన్ని రవిబాబు ఇంట్లోనే ఉంచనున్నారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత మహాప్రస్థానం ఫ్రీజర్లో ఉంచి బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

అబద్ధాల మోదీ

(మొదటిపేజీ తరువాయి)

అని చెప్పారు. బీజేపీ అధికార ట్విట్టర్ ఖాతా కూడా ఇదే విషయాన్ని చెప్పింది. కానీ ప్రముఖ న్యూస్ వెబ్‌సైట్ 'స్క్రోల్' ప్రధాని మోదీ మాటల్లో నిజం లేదని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ రికార్డుల ప్రకారం.. 2002 నాటికి అహ్మదాబాద్‌లో మూడు విశ్వవిద్యాలయాలు ఉన్నాయని ఫ్యాక్ట్ చెక్‌లో తేల్చింది. మరో ఆశ్చర్యకరమైన విషయమేమంటే స్వాతంత్ర్యం రాకముందే 1920 నవంబరులోనే గుజరాత్ విద్యాపీఠ్ అనే సంస్థను మహాత్మా గాంధీ స్థాపించారని పేర్కొంది. అలాగే 1949లో గుజరాత్ విశ్వవిద్యాలయం, 1994లో డా. బాబాసాహెబ్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్థాపించారని తెలిపింది.

అవ్వా...తాత పింఛన్లకు ఎసరు?

విశాలాంధ్ర-డిజిటల్:
అవ్వా, తాతా అంటూ ముద్దుముద్దుగా పిలుస్తూనే పుట్టిన రోజున కేక్ కట్ చేసినంత తేలికగా పెన్షన్‌లలో కోత పెట్టేశారు సీఎం జగన్. పింఛన్ వడబోతకు శ్రీకారం చుట్టేశారు. మూడో కంటికి తెలియకుండా పాత పెన్షన్లలో భారీ కోత విధిస్తూ కొత్తగా 2.5 లక్షల పెన్షన్లు మంజూరు చేశామని గొప్పలు చెప్పుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు తొలగించిన జాబితా, కొత్త జాబితా వచ్చి చేరాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా పింఛన్ పొందుతున్న లబ్ధిదారు లకు పింఛన్ తొలగించబడుతుందని నోటీసులు అందజేయడంతో బోరున విలపిస్తున్నారు. మొత్తం పింఛన్లలో పది శాతం కోత విధించినట్లు తెలిసింది. అంటే సుమారు ఆరు లక్షల పెన్షన్లు తొలగించబడతాయి. జనవరి నుంచి ఒక్కో పింఛన్‌దారుడికి రూ.2,750 చెల్లించనుండ డంతో భారీగా కోతకు తెరతీసినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 62.30 లక్షల మంది సామాజిక భద్రత పింఛన్లు పొందుతున్నారు. 2.5 లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేయడంతో 64.70 లక్షల మందికి ప్రతి నెలా సుమారు రూ.130 కోట్లు చొప్పున సాలీనా రూ.1,720 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా డిసెంబర్ నుంచి మే వరకు, జూన్ నుంచి నవంబర్ వరకు కొత్త పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తారు. మే వరకు స్వీకరించిన దరఖాస్తుదారులకు జూన్‌లోను, నవంబర్ వరకు స్వీకరించిన దరఖాస్తుదారులకు జనవరిలో కొత్త పింఛన్ మంజూరు చేయడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది దాదాపు 3 లక్షల వరకు దరఖాస్తులు రావడంతో పాత పింఛన్లు తొలగిస్తే తప్ప కొత్తవి ఇవ్వకూడదన్నట్లుగా జగన్ సర్కార్ వ్యవహరిస్తోంది. ఒంటరి మహిళలు, దివ్యాంగులపై ఈ ప్రభావం అధికంగా పడినట్లు తెలుస్తోంది. ఎప్పుడో 20 ఏళ్ల నుంచి పింఛన్ పొందుతున్న దివ్యాంగులు సదరన్ సర్టిఫికెట్ సమర్పించాలని నిబంధన పెట్టడంతో వారు గగ్గోలు పెడుతున్నారు. నడిచేందుకు కాళ్లే లేని తాము మరలా సదరన్ సర్టిఫికెట్ ఎలా సమర్పించాలని కంటనీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వ అడ్డగోలు ఆంక్షలపై పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్ల తరబడి వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్‌లు తీసుకుంటున్న లబ్ధిదారులకు పింఛన్ నిలిపివేస్తామని ముందస్తు నోటీసులు జారీ చేయడంతో కొద్ది రోజులుగా ఆందోళన చెందుతున్నారు. అసలు ఇల్లే లేని తమకు రెండు, మూడు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, 300 యూనిట్లు పైబడి బిల్లు వస్తుందని నోటీసులో పేర్కొనడంతో నెత్తీనోరు కొట్టుకుంటున్నారు. నూజివీడులో ఇల్లుంది... జక్కంపూడిలో ఇల్లుంది... మూడు మీటర్లు ఉన్నాయి అంటూ లేనివి ఉన్నట్లు నోటీసు ఇవ్వడంతో ఇదేం ఖర్మరా బాబూ అంటూ లబోదిబోమంటూ విద్యుత్ ఏఈ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. తమ బిడ్డలు రెక్కల కష్టంపైనే బతుకుతున్నారనీ, ఊరు వదిలి బిడ్డ వద్ద ఉంటున్నాననీ, పింఛన్ డబ్బులు కోడలికి ఇస్తుంటేనే ముద్ద పెడుతుందనీ, ప్రభుత్వం... ఇల్లుంది... మీటర్లున్నాయి... 300 యూనిట్లు పైబడి బిల్లు వస్తుంది... పింఛన్ నిలిపివేస్తున్నామని నోటీసు వచ్చింది... ఎన్నో ఏళ్లుగా లేనిది ఈరోజు పింఛన్ ఆపివేస్తాం అంటుంటే నేను ఎలాబతకాలి... ఎవరు ముద్దపెడతారు అంటూ ఓ 75 ఏళ్ల వృద్ధురాలు బావురుమనడం చూపరులను కలచివేసింది. మగదిక్కులేని నేను అనారోగ్యం రీత్యా బిడ్డల వద్ద ఉండడం నేను చేసిన నేరమా అని ప్రభుత్వాన్ని నిలదీస్తోంది. పట్టుమని పది నిమిషాలు కూడా కదలలేని తాము గంటల తరబడి కార్యాలయాల చుట్టూ ఎలా తిరిగేది భగవంతుడా అని కంటనీరు పెట్టుకుంటున్నారు కొందరు వృద్ధులు. చంద్రబాబు హయాంలో తెల్ల రేషన్ కార్డు తొలగిస్తే... రాజశేఖర్ రెడ్డి హయాంలో అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చారనీ... తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తాడని, తండ్రికి మించిన తనయుడిగా పేరు తెచ్చుకుంటారని 'ఒక్క సారి అవకాశం ఇవ్వండి... తలరాతలు మార్చేస్తాను' అంటే ఓట్లు వేశామని, ఇలా అడ్డగోలు ఆంక్షలు పెట్టి తమ బతుకు దెరువుకు భరోసా ఇస్తున్న పింఛన్ నిలిపివేయడం అంటే ఇదేనా మా తలరాత మార్చడం... ఇది అత్యంత దుర్మార్గమని పింఛన్‌దారులు మండిపడుతున్నారు. భర్త చనిపోయి 15 ఏళ్లు అయింది... ఆధార్ కావాలని అడుగుతున్నారు... ఆనాడు ఆధార్ ప్రక్రియే లేదు... నేను ఎలా తెచ్చేది అని వితంతు పింఛన్ పొందుతున్న ఓ వృద్ధురాలు లబోదిబోమంటోంది. భార్య లేదు... ఇద్దరు బిడ్డలు రెక్కల కష్టంపై వేర్వేరు చోట్ల బతుకుతున్నారు... జగన్ 60 ఏళ్లకే పింఛన్ ఇస్తానంటే దరఖాస్తు చేశాను... మూడేళ్లుగా వృద్ధాప్య పింఛన్ వస్తోంది... నాకు అసలు ఇల్లే లేదు... అర్హులు దరఖాస్తు చేస్తే ఇల్లిస్తాం అన్నారు... మూడేళ్లలో మూడు సార్లు దరఖాస్తు చేశాను... కనీసం స్థలం కూడా రాలేదు... ఇప్పుడు ఇల్లు లేకపోయినా మూడు మీటర్లు ఉన్నాయి... పింఛన్ నిలుపుదల చేస్తాం అంటూ నోటీసులు ఇచ్చారు అంటూ ఓ వృద్ధుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదంతా తమబోటి వారికి పింఛన్ ఎగ్గొట్టేందుకే ప్రభుత్వం ఇలా భూతద్దంతో వెదుకుతోందని మండిపడ్డాడు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది పింఛన్‌దారులు నోటీసులు అందుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉండడం మనసులను కదిలించేస్తోంది. రూరల్ మండలంలో ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, పట్టణాల్లో మున్సిపల్ రెవెన్యూ అధికారులు న్యాయసమ్మతం కాని సర్వే ప్రక్రియ నిర్వహించి పింఛన్ల వడబోతకు కారకులయ్యారు.

మ్యాపింగ్ మాయాజాలం

మ్యాపింగ్ మాయాజాలం... సచివాలయాల సాఫ్ట్‌వేర్‌కు పింఛన్‌దారు ఆధారు అనుసంధానం చేస్తే అద్దె ఇంటిలో ఉన్న అన్ని మీటర్లు లబ్ధిదారుల పేరునే చూపిస్తున్నాయి. దీంతో మీ పేరున మూడు... ఐదు మీటర్లు ఉన్నాయని లేనివన్నీ నోటీసులో పేర్కొంటూ పింఛన్ నిలిపివేస్తామని అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. అనారోగ్యంతో ఒంటరిగా ఉండలేక బిడ్డల వద్ద కొంత కాలం ఉండివెళ్లాలని పింఛన్ మార్పించుకుంటే అసలు మీటరే లేకపోయినా ఐదు మీటర్లు ఉన్నాయని నోటీసు ఇవ్వడంతో ఒంటరి మహిళలు గుండెబాదుకుంటున్నారు. దివ్యాంగులు బోరున విలపిస్తున్నారు. మ్యాపింగ్ మాయాజాలం నుంచి తమను రక్షించి ఏళ్ల తరబడి పింఛన్‌తో బతుకుతున్న తమ పొట్టపై కొట్టవద్దంటూ వేడుకుంటున్నారు.

ఇల్లు లేదు... స్థలం లేదు... రెండు మీటర్లు ఉన్నాయన్నారు

నాకు ఇల్లు లేదు, స్థలం లేదు. నీ పేరుమీద రెండు మీటర్లు ఉన్నాయి... పింఛన్ నిలిపివేస్తాం అని నోటీసు ఇచ్చారు. సున్న విద్యుత్ కార్యాలయానికి పడుతూ లేస్తూ వచ్చా. ఉన్న విషయం చెప్పా. ఆధార్ ఆధారంతో వెదికితే నా పేరు మీద ఏ మీటరు లేదని లెటర్ ఇచ్చారు. ఇది తీసుకెళ్లి సచివాలయంలో అంద జేయాలి. అసలు ఇలా ఎందుకు జరిగిందో అర్థం కావడం లేదు. భార్య లేదు. ఒంటరిగా ఉంటున్నాను. శక్తి చచ్చిపోయింది. పైసా పని చేయలేదు. పింఛన్ ఆధారం. ఇదే లేకుంటే బతకడం కష్టమే.

– కంటిపూడి రత్నారావు, వైఎస్సార్ కాలనీ, జక్కంపూడి

పింఛన్ ఆగితే ముద్దపెట్టేదెవరు

కాలనీలో ఒక మీటరు, నూజివీడులో మరో మీటరు ఉంది అన్నారు. ఇవి గాక మరో మూడు మీటర్లు నీ పేరున ఉన్నాయి అని నోటీసులు పేర్కొన్నారు. నెలకు 180 నుంచి 190 యూనిట్లు బిల్లు వస్తుంది. అది కూడా ఉంది. భర్త చనిపోయాడు. ఆధార్ తీసుకురమ్మంటున్నారు. ఎక్కడ తెచ్చేది. 75 ఏళ్ల వయసులో ఎక్కడని తిరగాలి. పింఛన్ డబ్బులు ఇస్తుంటేనే కోడలు ముద్ద పెడుతుంది. పింఛన్ ఆగిపోతే ముద్దపెట్టేదెవరు.

– షేక్ అఫ్రీఫున్నీసా బేగం, జక్కంపూడి కాలనీ, విజయవాడ రూరల్

రెక్కల కష్టం మీద బతికేవాడిని

నేను భూస్వామిని కాను. రెక్కల కష్టం మీద బతికేవాడిని. నాకు రెండు చిన్న ఇళ్లు ఉన్నాయి. అప్పట్లో నా పేరుమీద మీటర్లు ఇచ్చారు. మా అబ్బాయి పేరుమీద మార్చేశా. ఆధార్ అనుసంధానం అవ్వలేదు... నీ పేరునే ఉన్నాయి... పింఛన్ ఆపేస్తాం అని నోటీసుల ఇచ్చారు. ఎనిమిదేళ్లుగా పింఛన్ తీసుకుంటున్నాను. నాకు తిండిపెట్టేవాళ్లే లేరు. పింఛన్ ఒక్కటే ఆధారం. పింఛన్ నిలిపేసి నోటికాడ కూడు తీయొద్దు. రండి... మా ఇంటికొచ్చి నేను ఎలా జీవిస్తున్నానో ఒక్కసారి పరిశీలించండి. తలరాత మారుస్తానంటే ఓటేశాం. చివరికి రాత మారడమంటే పింఛన్ ఎత్తేయడమేనేమో.

– మదీనా సాహెబ్, ముస్తాబాద

పై అధికారుల దృష్టికి తీసుకెళ్తా

మ్యాపింగ్ సాఫ్ట్‌వేర్‌లో ఎక్కడో లోపం ఉండి ఉంటుంది. చిరునామా మారిస్తే ఆ ఇంటి యజమాని పేరున ఉన్న విద్యుత్ మీటర్లు లబ్ధిదారునివిగా చూపించవచ్చు. అందుకనే పింఛన్ నిలిపివేస్తున్నామని నోటీసులు ఇచ్చి ఉంటారు. నేను కొత్తగా ఇక్కడికి వచ్చా. సమస్యను పరిశీలించి పై అధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– భార్గవి పాపతి, ఎంపీడీవో-విజయవాడ రూరల్

మద్యానికి ఏటా 20 లక్షల మంది బలి

కేంద్ర మంత్రి కౌశల్ కిషోర్

న్యూఢిల్లీ: మద్యం కారణంగా తమ కుటుంబం ఎంతో నష్టపోయిందని, తమలా మరెవ్వరూ క్షోభను అనుభవించరాదని కేంద్ర మంత్రి కౌశల్ కిషోర్ అన్నారు. మద్యానికి బానిసై తన కుమారుడు మరణించి తమకు కడుపుకోత మిగిల్చాడని కన్నీళ్లుపెట్టారు. తాగుబోతులకు మీ అమ్మాయిని ఇచ్చి వారి గొంతు కోయకండి. వారి అందమైన జీవితాన్ని తాగుబోతుల చేతుల్లో పెట్టకండి అని ఆడపిల్లల తండ్రులకు సూచించారు. మద్యం తాగేవారంతా పెళ్లికి దూరంగా ఉండాలని కూడా సలహా ఇచ్చారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారితో పోరాడి 6.32 లక్షల మంది తమ ప్రాణాలను త్యాగం చేశారని, కేవలం మద్యం వ్యసనం కారణంగా ఏటా 20 లక్షల మంది మరణిస్తున్న విషయం మరిచిపోవద్దని చేతులెత్తి నమస్కరిస్తూ చెప్పారు. సిగరెట్, బీడీ, ఆల్కహాల్ బానిసలను కాపాడేందుకు ఎన్జీవోలు డి-ఎడిక్షన్ కేంద్రాలను నడపాలని కోరారు. ఉత్తరప్రదేశ్‌లోని లంభువా అసెంబ్లీ నియోజకవర్గంలో డి-అడిక్షన్‌పై నిర్వహించిన కార్యక్రమానికి కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి కౌశల్ కిషోర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, 'నేను ఎంపీగా, నా భార్య ఎమ్మెల్యే. అయినా మా కుమారుడు ఆకాశ్ కిషోర్ మద్యానికి బానిసగా మారాడు. చెడు స్నేహం వల్ల మద్యం అలవాటైంది. డి-అడిక్షన్ సెంటర్‌లో చేర్పించాం. చెడు అలవాటు మానేస్తానని చెప్పాడు. చికిత్స పొందుతూ ఆరు నెలలకే పెళ్లి చేసుకున్నాడు. మళ్లీ తాగడం మొదలుపెట్టాడు. ఆ దురలవాటు అతని మరణానికి దారితీసింది. రెండేళ్ల క్రితం ఆకాశ్ కిషోర్ చనిపోయే నాటికి అతడి కుమారుడికి రెండేళ్ల వయసు. కట్టుకున్న భార్యను అనాథగా వదిలి వెళ్లిపోయాడు. పిల్లాడు తండ్రిలేని వాడయ్యాడు. వారు నిత్యం క్షోభ అనుభవిస్తున్నారు' అని తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. మంత్రి మాటలకు అక్కడున్న వారంతా చలించిపోయారు.

ముందస్తుకే మొగ్గు!

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియ వేగంగా సాగుతోంది. అలాగే ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా గడపగడపకూ ప్రభుత్వం పేరుతో వైసీపీ శాసనసభ్యులందరూ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. గత మూడున్నర సంవత్సరాల కాలంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను అధికారపార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఇంటింటికీ తిరిగి వారికి వైసీపీ ప్రభుత్వం వల్ల ఏమేర లబ్ది జరిగిందో పథకాల వారీ లెక్కలు వేసి మరీ వివరిస్తున్నారు. అలాగే 2019 ఎన్నికల సందర్భంగా వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేశామని, ఈస్థాయిలో దాదాపు 99శాతం హామీలు అమలు చేసిన చరిత్ర దేశంలోనే ఇప్పటివరకు ఎక్కడా, ఏ ప్రభుత్వానికి లేదని వారు ప్రజలకు వివరిస్తూ, మరొక్కసారి తమకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. వాస్తవానికి ఈ కార్యక్రమం సుమారు 6 నెలలుగా రాష్ట్రంలో కొనసాగుతుండగా, దీని ముఖ్య ఉద్దేశమే ముందస్తు ఎన్నికల వ్యూహంగా అధికారపార్టీ నేతలు పేర్కొంటున్నారు. వచ్చే ఏడాది బడ్జెట్ సమావేశాలు పూర్తయిన తర్వాత ఏ నిముషంలోనైనా అసెంబ్లీని రద్దు చేసే అవకాశం ఉందని, అందుకే ఈలోగా తమ నియోజకవర్గాల్లోని ప్రతి ఇంటినీ సందర్శించే కార్యక్రమం పూర్తి చేసేలా పార్టీ అధినేత ప్రణాళిక సిద్ధం చేసినట్లు నేతలు చెపుతున్నారు. దీనివల్ల అధికారికంగానే తమ ఎన్నికల ప్రచారం తొలివిడత విజయవంతంగా పూర్తవుతుందని, ప్రతిపక్షాలు ఎన్నికలకు సిద్ధమయ్యేలోగా, మలివిడత ప్రచారం కూడా తాము పూర్తి చేసుకునే అవకాశం ఏర్పడుతుందని వారు పేర్కొంటున్నారు. అధికారపార్టీ ముందస్తు వ్యూహాన్ని గమనించే ప్రతిపక్షాలు సైతం ఎన్నికలకు ఎప్పుడైనా తాము సిద్ధమేనంటూ సవాల్ విసురుతుండటం గమనార్హం.

నేడు శ్రీశైలానికి రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించనున్నారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం రాష్ట్రపతి... కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు చెందిన తీర్థయాత్ర స్థల పునరుజ్జీవం, ఆధ్యాత్మిక అభివృద్ధి డ్రైవ్ (ప్రసాద్) కింద శ్రీశైలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. అనంతరం రాష్ట్రపతి శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఈ నెల 26 నుంచి 30 వరకు ఐదు రోజులపాటు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ నుంచి అధికారిక ప్రకటన విడుదలైంది. డిసెంబర్ 27న హైదరాబాద్‌లోని కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తారు. అదే రోజు, ఆమె సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీని సందర్శిస్తారు. అక్కడ ఇండియన్ పోలీస్ సర్వీస్ (74వ ఆర్ఆర్ బ్యాచ్) ఆఫీసర్ ట్రైనీలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. హైదరాబాద్‌లో మిశ్రా ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) వైడ్ ప్లేట్ మిల్లును కూడా ముర్ము ప్రారంభించనున్నారు. డిసెంబర్ 28న రాష్ట్రపతి భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామివారి దేవస్థానాన్ని సందర్శిస్తారు. ఆలయంలో ప్రసాద్ పథకం కింద పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. తెలంగాణ వనవాసి కళ్యాణ్ పరిషత్ నిర్వహించే 'సమ్మక్క సారలమ్మ జనజాతి పూజారి సమ్మేళనం', అలాగే కొమరం భీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్ జిల్లాల్లో గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్ని ఆమె వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అదే రోజు, ముర్ము వరంగల్ జిల్లాలోని రామప్ప ఆలయాన్ని సందర్శిస్తారు. ఆలయంలో పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి, కామేశ్వరాలయ ఆలయ పునరుద్ధరణకు ఆమె శంకుస్థాపన చేయనున్నారు. డిసెంబర్ 29న హైదరాబాద్‌లోని జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, బీఎమ్ మలానీ నర్సింగ్ కాలేజ్, సుమన్ జూనియర్ కాలేజ్ ఆఫ్ మహిళా దక్షత సమితి విద్యార్థులు, అధ్యాపకులతో రాష్ట్రపతి సమావేశమవుతారు. అదే రోజు శంషాబాద్‌లోని శ్రీరాంనగరం, సమానత్వ విగ్రహాన్ని కూడా ఆమె సందర్శిస్తారు. డిసెంబరు 30న ఆమె దిల్లీకి తిరిగి వెళతారు.

వణుకుతున్న మన్యం

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఆంధ్రా కశ్మీర్ లంబసింగిలో పెరిగిన చలి తీవ్రత
- ఆస్వాదించేందుకు క్యూ కట్టిన పర్యాటకులు

విశాలాంధ్ర-చింతపల్లి : మన్యంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో చలి తీవ్రత పెరిగింది. గత మూడు రోజులుగా ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గడంతో మన్యం ప్రాంత వాసులు గజగజ వణుకుతున్నారు. ఆదివారం చింతపల్లిలో 4.8గా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతోపాటు పొగ మంచు దట్టంగా కమ్ముకోవడంతో దైనందిన కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడింది. ఉన్ని దుస్తులు ధరించి, చలి మంటలు కాగుతూ పర్యాటకులు మన్యం ప్రాంత వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. లంబసింగి, కొత్తపల్లి వాటర్ ఫాల్స్, చాపరాయితోపాటు అరకు వంటి ప్రాంతాల్లో పర్యాటకుల తాకిడి అధికంగా కనిపిస్తోంది. రానున్న రోజుల్లో ఈ ఉష్ణోగ్రతలు మరింతగా తగ్గే అవకాశం ఉందని, చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోస సంబంధ వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు పాటించాలని వాతావరణ శాస్త్రవేత్తలు, వైద్యులు సూచిస్తున్నారు.

బలహీనపడిన అల్పపీడనం

రాష్ట్రంలో కొన్నిచోట్ల వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : నైరుతి బంగాళాఖాతంలో ఉన్న వాయుగుండం పశ్చిమ నైరుతిగా పయనించి ఆదివారం ఉత్తర శ్రీలంకలో తీరం దాటి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది. ఇది పశ్చిమ నైరుతిగా పయనిస్తూ సోమవారం ఉదయానికి కొమెరిన్ తీరం దిశగా వస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో కోస్తా, రాయలసీమలో చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో దక్షిణకోస్తా, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని విశాఖపట్నం వాతావరణ శాఖ తెలిపింది. కాగా రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, చింతపల్లి, అరకులోయ ఏజెన్సీ ప్రాంతాల్లో చలి ప్రభావం కొనసాగింది. పాడేరు సమీపంలోని జి.మాడుగులలో 5.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. తిరుమలలో ఆదివారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. వేకువజాము నుంచే మొదలైన వర్షం రాత్రి వరకు చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో తిరుమలకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడ్డారు. శ్రీవారి దర్శనానికి వెళ్లే సమయంలో, దర్శనానంతరం ఆలయం వెలుపలకు వచ్చిన సందర్భంలో వర్షంలో తడుస్తూనే వెళ్లారు. ఆలయ మాడవీధులు, కాటేజీలు, బస్టాండ్, రోడ్లు, పార్కులు వంటి ప్రాంతాలు వర్షంలో తడిచి ముద్దయ్యాయి. మరోవైపు ఆదివారం కావడంతో తిరుమలలో రద్దీ భారీగా పెరిగింది. గదులు లభించిన భక్తులు వర్షంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక ఘాట్లలో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. మరోవైపు పొగమంచు కమ్మేయడంతో తిరుమల కొండపై చలితీవ్రత కూడా పెరిగింది. చిన్నపిల్లలు, వృద్ధులతో వచ్చిన భక్తులు అవస్థ పడ్డారు.

దేశాభివృద్ధికి వాజ్‌పేయి కృషి

సుపరిపాలన దినోత్సవంలో గవర్నర్ విశ్వభూషణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ మాజీ ప్రధాని, భారతరత్న అతల్ బిహారీ వాజ్‌పేయి భారతదేశ అభివృద్ధి కోసం ఎంతో ముందు చూపుతో వ్యవహరించారని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా విజయవాడ రాజ్ భవన్ వేదికగా ఆదివారం 'సుపరిపాలన దినోత్సవం' ను ఘనంగా నిర్వహించారు. దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు దేశ రక్షణ అవసరాల పరంగానూ అతల్ ఎక్కడా రాజీ పడలేదన్నారు. దేశాభివృద్ధికి వాజ్‌పేయి చేసిన కృషి మరువలేనిదని 'స్వర్ణ చతుర్భుజి'ని ప్రారంభించి దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మార్గం చూపారన్నారు. నాలుగు మెట్రోపాలిటన్ నగరాలను కలుపుతూ ఏర్పాటు చేసిన హైస్పీడ్ జాతీయ రహదారుల ప్రాజెక్టు ఫలాలను ఇప్పుడు ప్రజలు ఆస్వాదిస్తున్నారన్నారు. 60 ఏళ్లు పైబడిన పేద వృద్ధులకు 10 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేసి సంక్షేమ రంగంలో కొత్తవరవడిని సృష్టించా రన్నారు. గ్రామాలను కలుపుతూ ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన, ప్రాథమిక, మాధ్యమిక విద్య నాణ్యతను పెంపొందించేందుకు సర్వశిక్షా అభియాన్ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు వాజ్‌పేయి హయాంలో ప్రారంభమయ్యాయన్నారు. అణు పరీక్షల వేళ ప్రపంచంలోని పెద్ద శక్తులు వాజ్‌పేయిపై విరుచుకుపడగా తొలుత నిశ్శబ్దంగా ఉన్న ఆయన ఐదు పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసిన తరువాత అణుశక్తి దేశంగా భారత్‌ను ప్రకటించారని గుర్తు చేశారు. ఏ దేశంపైనా దాడి చేసే ఉద్దేశం భారత్‌కు లేదని, అదేరీతిన భారత్‌పై దాడి చేసే సాహసం ఏ దేశమూ చెయ్యబోదని స్పష్టం చేశారని వివరించారు. నాడు ప్రపంచ దేశాలు విధించిన ఆర్థిక ఆంక్షలను సైతం సమర్ధవంతంగా ఎదు ర్కొని, ఉన్న వనరులతో దేశాన్ని ఎలా నిర్మించు కోగలుగుతామన్న దానిని చేసి చూపారన్నారు. వాజ్‌పేయి గౌరవార్థం ప్రభు త్వంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొం దిస్తూ, వారికి అవగాహన కల్పించడానికి 'సుపరిపాలన దినో త్సవం' జరుపుకుంటు న్నామన్నారు. సమాజంలో అవినీతికి చోటు లేదని, ప్రతి ఒక్కరూ ఆనందం, గౌరవం, సమాన అవకాశాలతో జీవించే హక్కు ఉందన్న విషయాన్ని ఈ రోజు మనకు గుర్తు చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్, ఉపకార్యదర్శి నారాయణ స్వామి, అనేక మంది మాజీ సైనికాధికారులు, ఇతర అధికారులు, రాజ్ భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలో 34 ఎమ్మెల్యే స్థానాలు చంద్రబాబుకు కానుక ఇస్తాం

మాజీ మంత్రి బండారు సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన విజయవంతం అయినందుకు టీడీపీ నేతలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బండారు సత్యనారాయణ ఆదివారం విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ రాజాం, బొబ్బిలి, విజయనగరం నియోజకవర్గాల్లో చంద్రబాబు రోడ్‌షోలకు అధిక సంఖ్యలో జనం రావడం మంచి శుభ పరిణామమన్నారు. పైడితలమ్మ పండుగ సిరి మానోత్సవంలో పాల్గొనే విధంగా రోడ్ షోలో ప్రజలు పాల్గొన్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ స్థానాలను చంద్రబాబు నాయుడుకు కానుకగా ఇచ్చే బాధ్యత తమదని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వేలకోట్ల భూములను వైసీపీ ప్రభుత్వం కొల్లగొట్టిందని, వైసీపీ నేతల భూ కబ్జాలను ఉత్తరాంధ్ర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డితో ప్రజలు విసుగు చెంది, చంద్రబాబుని ముఖ్యమంత్రి చేయాలని ఎదురుచూస్తున్నారని బండారు సత్యనారాయణ వ్యాఖ్యానించారు.

కేంద్రం వైఖరికి నిరసన

జనవరి 27న విశాఖలో 'ప్రజాగర్జన'

బహిరంగసభకు హాజరు కానున్న లక్షల మంది

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం (విశాఖ): కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా ప్రజా ఉద్యమానికి విశాఖ ఉక్కు పోరాట కమిటీ సిద్ధమైంది. అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో జనవరి 27న లక్ష మందితో 'ప్రజాగర్జన' బహిరంగసభ నిర్వహిస్తామని పోరాట కమిటీ ప్రకటించింది. 32 మంది అమరవీరుల త్యాగంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని మరోమారు సంకల్పించింది. కరోనా సమయంలో కార్మికులు ప్రాణాలు పణంగా పెట్టి పనిచేశారని, పరిశ్రమను లాభాల బాటలో నడిపించారని గుర్తుచేసింది. విశాఖ ఉక్కు పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక వనరు, దేశానికే తలమానికమని తెలిపింది. తమిళనాడు జల్లికట్టు, తెలంగాణ సాధన ఉద్యమాన్ని ఆదర్శంగా తమ పోరాటంలో భాగస్వామ్యం కావాలని కార్మిక నేతలకు పిలుపునిచ్చింది.

తక్షణమే విశాఖ ఉక్కు అమ్మకాలు ఆపాలి

విశాఖ ఉక్కు జోలికి వస్తే సహించేది లేదని విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఉక్కు నిర్వాసితుల సంక్షేమ సంఘం, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో వడ్లపూడి నిర్వాసిత కాలనీ లక్ష్మీపురంలో విశాఖ ఉక్కు అమ్మకాలకు వ్యతిరేకంగా రిలే దీక్షను ఆదివారం ప్రారంభించారు. పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ పోరాట కమిటీ కో కన్వీనర్ జె.అయోధ్య రామ్, జె.రామకృష్ణ, సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జీవీఎంసీ కార్పొరేటర్లు బి గంగారామ్, లేళ్ల కోటేశ్వరరావు, బోండా జగన్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తమ అనుమయులకు పరిశ్రమలు కట్టబెడుతున్నదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం జరిగిన త్యాగాలను వృధా కానివ్వమని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం 16,500 మంది రైతులు 25,000 ఎకరాల భూమిని త్యాగం చేశారని, వారిలో ఎనిమిది వేల మందికి మాత్రం ఉపాధి కల్పించాలన్నారు. మిగిలిన నిర్వాసితులకు తక్షణమే ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు అమ్మకాలను ఉపసంహరించుకోకపోతే ప్రజా ఉద్యమం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మెడల వంచుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డి. అప్పలనాయుడు, పోరాట కమిటీ సభ్యులు రామస్వామి నివాసరాజు, శ్రీనివాస నాయుడు చిత్రల సన్యాసిరావు పరందామయ్య, సుబ్బన్న, జ్యోతి ప్రసాద్, కోమటి శ్రీనువాస్‌రావు, ప్రగడ వేణుబాబు, సంతోష్ కుమార్ రాజు, ఎం దానయ్య, కె.రమణ, వీరస్వామి, కే వేణు వి. వి.రమణ, కె.శ్రీనువాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇదెక్కడి సామాజిక న్యాయం ?

- గిరిజనుల పెన్షన్లకు రూ.971 కోట్లు,
- రెడ్డి కార్పొరేషన్‌కి రూ.1555 కోట్లు కేటాయింపా?
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎస్సీ,ఎస్టీ,బీసీల ఓట్లతో గద్దెనెక్కిన జగన్ అధికారంలోకి వచ్చాక ఆ వర్గాలకు అడుగడుగునా అన్యాయం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పదవుల పంపకం మొదలు బడ్జెట్ కేటాయింపుల వరకు అన్నింటిలోనూ జగన్ తన సామాజికవర్గానికి పెద్దపీట వేసి, మిగిలిన సామాజిక వర్గాలకు కత్తి పీట వేస్తున్నారన్నారు. 2022- 23 బడ్జెట్ లో 5.53 శాతం ఉన్న గిరిజనుల పెన్షన్లకు కేవలం రూ. 971 కోట్లు కేటాయించిన జగన్, తన సామాజికవర్గ రెడ్డి కార్పోరేషన్ పెన్షన్లకు మాత్రం రూ. 1555 కోట్లు కేటాయించారని తెలిపారు. పైగా రెడ్లలో పేదరికం పెరిగినట్టు లెక్కలు చెబుతున్నారన్నారు. నిజంగా రెడ్డి సామాజికవర్గంలో పేదరికం పెరిగినా దామాషా ప్రకారం 17.08 శాతం ఉన్న ఎస్సీలకు రూ. 7 వేల కోట్లు, 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు రూ. 16 వేల కోట్లు కేటాయించాలి. కానీ ఎస్సీలకు కేవలం రూ. 3 వేల కోట్లు, బీసీలకు రూ.8 వేల కోట్లే కేటాయించి సగం నిధులు కోత కోశారు. జగన్‌కి ఎస్సీ, ఎస్టీ, బీసీలంటే ఎందుకంత కక్ష అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి అన్ని కులాల్ని ఆదరించాలి. కానీ ఒక కులానికి మాత్రమే అధిక ప్రాధాన్యత ఇవ్వటం తగదని హితవుపలికారు. జగన్ చేస్తున్న మోసాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా గ్రహించాలని అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

స్వాతంత్ర్య సమరయోధులు రావూరి అర్జునరావు మృతి

- నెహ్రూ సమక్షంలో మొదటి సంస్కరణ వివాహం
- జీజీహెచ్‌కు పార్థివదేహం అప్పగింత

విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, సంస్కరణ వాది, నాస్తికులు రావూరి అర్జున రావు (105) ఆదివారం హైదరాబాద్‌లో కుమారుని ఇంటి వద్ద మరణించారు. ఆయనకు భార్య మనోరమ, నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అర్జునరావు నాస్తిక ఉద్యమ ప్రముఖులు గోరా అల్లుడు. స్వాతంత్ర్యం తర్వాత జరిగిన తొలి సంస్కరణ వివాహం వారిదే. మహాత్మా గాంధీ మరణంతో జవహర్‌లాల్ నెహ్రూ ఆ వివాహాన్ని నిర్వహించారు. రావూరి అర్జున రావు తన జీవిత కాలంలో సామాజిక సమస్యల పై అనేక ఉద్యమాలకు నేతృత్వం వహించారు. ప్రస్తుతం ఆయన కృష్ణాజిల్లా స్వాతంత్ర్య సమర యోధుల సంఘానికి ఉపాధ్యక్షులుగా ఉన్నారు. రెండేళ్ల క్రితం గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ రాష్ట్రపతి నుంచి అత్యున్నత పురస్కారం ఆనాటి జిల్లా కలెక్టర్ స్వయంగా వారి ఇంటికి వెళ్లి మనోరమ అర్జునరావు దంపతులకు అందజేసి సత్కరించారు. గాంధీ జయంతి రోజున నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అర్జున రావును ఘనంగా సత్కరించారు. స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాలను భవిష్యత్ తరాలకు అందించాలన్న లక్ష్యంతో నిర్మితమైన స్వాతంత్ర్య సమర యోధుల భవన నిర్మాణ పనుల్లో తమ తోడ్పాటును అందించటంతో పాటు ప్రతినిత్యం తమ సూచనలు అందించేవారు. అటువంటి మహోన్నత వ్యక్తి అర్జున రావు మృతి తీరని లోటు. రావూరి అర్జున రావు పార్థివదేహాన్ని విజయవాడ నాస్తిక కేంద్రానికి తరలించి సోమవారం ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. అనంతరం అంతిమ యాత్ర, వైద్య కళాశాలకు దేహదానం జరుగుతుందని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. అర్జున రావు మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని సర్వోదయ ట్రస్ట్ కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, అధ్యక్షులు జి.మోహన్ ప్రసాద తెలిపారు. 105 సంవత్సరాల సుదీర్ఘ జీవనం సాగించి కుల, మతాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సాంఘిక సంస్కరణ కోసం నిరంతరం కృషి చేసిన మహా వ్యక్తి అర్జున రావు అని నాస్తిక ఉద్యమ నాయకులు అరుణ కుమార్ పేర్కొన్నారు. అర్జునరావు మృతికి స్వాతంత్ర్య సమరయోధులు, సీనియర్ సిటిజన్స్, నగర ప్రముఖులు సంతాపం తెలిపారు.

ప్రత్యేక రైళ్లు సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణీకుల రాకపోకల రద్దీ పెరగడంతో దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లు నడిపేందుకు సన్నద్ధమైంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో సొంత ఊళ్లకు, ఇక్కడి నివసిస్తూ ఇతర రాష్ట్రాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరగడంతో సంక్రాంతికి ఇప్పటికే రైళ్లన్నీ నిండిపోయాయి. రెగ్యులర్ రైళ్లల్లో వెయింట్ లిస్టు భారీగా కనిపిస్తోంది. కొన్ని ప్రధాన రైళ్లలో రిజర్వేషన్ కూడా తీసుకోవటం లేదు. దీంతో పెరుగుతున్న రద్దీని పరిణగణలోకి తీసుకొని దక్షిణ మధ్య రైల్వే సంక్రాంతికి ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. అందులో భాగంగా 14 ప్రత్యేక రైళ్లను ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉన్న మార్గాల్లో నడపాలని నిర్ణయించారు. జనవరి 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఈ ప్రత్యేక రైళు అందుబాటులో ఉంటాయి.ఇందులో అధికంగా తెలుగు రాష్ట్రాల మధ్యనే కేటాయించారు. సికింద్రాబాద్, కాచిగూడ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు ఎక్కువగా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. వీటికి రిజర్వేషన్ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ప్రత్యేకంగా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి సొంత గ్రామాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా ఉంటుంది. దీంతో, మచిలీపట్నం-కర్నూల్, మచిలీపట్నం-తిరుపతి, విజయవాడ-నాగర్‌సోల్, కాకినాడ-లింగంపల్లి, అకోలా-పూర్ణ పట్టణాల మధ్య ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక రైళ్లను ప్రకటించారు. మచిలీపట్నం నుంచి కర్నూలు సిటీ (ట్రైన్ నెంబర్.07067) జనవరి 3,5,7,10,12,14,17వ తేదీలలో అందుబాటులో ఉండనుంది. అదేవిధంగా కర్నూలు సిటీ నుంచి మచిలీపట్నం (ట్రైన్ నెం.07068) 4,6,8,11,13,15,18వ తేదీలలో నడపనున్నారు. మచిలీపట్నం నుంచి తిరుపతి (ట్రైన్ నెం.07095) 1,2,4,6,8,9,11,13,15,16వ తేదీలలో ప్రత్యేక రైలు అందుబాటులో ఉండనుంది. విజయవాడ నుంచి నాగర్‌సోల్ (ట్రైన్ నెం.07698) 6,13వ తేదీలలో, నాగర్‌సోల్ నుంచి విజయవాడ (07699) 7,14వ తేదీలలో రైళ్లు ప్రకటించారు. కాకినాడ నుంచి లింగంపల్లి (07445) వరకు 2,4,6,9,11,13,16,18వ తేదీలలో.. లింగంపల్లి నుంచి కాకినాడ (07446)కు 3,5,7,10,12,14,17,19వ తేదీలలో ప్రత్యేక రైళ్లు నడపనున్నారు.

అదేవిధంగా తిరుపతి నుంచి మచిలీపట్నం (రైలు నెం.07096) 2,23,5,7,9,10,12,14,16,17వ తేదీలలో ప్రత్యేక రైలు ఏర్పాటు చేసారు. తిరుపతి నుంచి అకోలా (07605) ట్రైన్ 6,13వ తేదీల్లో.. అకోలా నుంచి తిరుపతికి (07606) 8, 15వ తేదీలలో ప్రత్యేక రైళ్లు షెడ్యూల్ చేశారు. పూర్ణ నుంచి తిరుపతికి (ట్రైన్ నెం.07607) 2,9,16వ తేదీలలో, తిరుపతి నుంచి పూర్ణకు (రైలు నెం.07608) 3,10,17వ తేదీలలో స్పెషల్ సర్వీసులు అందుబాటులోకి తీసుకొచ్చారు.

గంటకో అప్పు... అరగంటకో అబద్ధం

రోజుకో నిబంధన ఉల్లంఘన: రాష్ట్ర ప్రభుత్వ తీరుపై యనమల ధ్వజం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అరగంటకో అబద్ధం చెపుతూ, గంటకో చోట అప్పు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిగా మార్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కాగ్ అధికారుల సమక్షంలో బహిరంగ చర్చకు సిద్ధం కావాలని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు ఆదివారం ఒక ప్రకటనలో సవాల్ విసిరారు. రాష్ట్ర భవిష్యత్‌కు సంబంధించిన అప్పులపై సీఎం, మంత్రులు రోజుకో విధంగా మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధ సంస్థలైన కాగ్ వంటి వాటికి కూడా వాస్తవాలు ఇవ్వకుండా దాచిపెడుతున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం లెక్కలు, నివేదికలు ఇవ్వడంలేదని కాగ్ చెప్పిన విషయం వాస్తవంకాదా? అని ప్రశ్నించారు. జగన్ రాష్ట్రానికి చేసిన అభివృద్ధి, సంక్షేమం కన్నా అప్పులు చేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయటంపైనే ఎక్కువ దృష్టి పెట్టారని యనమల దుయ్యబట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అన్ని ప్రభుత్వాలు కలిపి 1956 నుంచి 2019 వరకు చేసిన అప్పులు రూ. 2 లక్షల 53వేల కోట్లు అయితే, వైసీపీ ప్రభుత్వం ఈ మూడున్నరేళ్లలో రూ.6 లక్షల 38వేల కోట్లు అప్పు చేసిందన్నారు. వీటికి అదనంగా ఉద్యోగులకు ఇవ్వాల్సిన వేతనాలు, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు వేల కోట్లల్లో ఉంటాయి. జగన్ ఐదేళ్ల పదవీ కాలం పూర్తయ్యేనాటికి ఈ అప్పు రూ.11 లక్షల కోట్లకు పైగా చేరుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేషన్లు, వివిధ సంస్థల ద్వారా తీసుకొస్తున్న అప్పుల లెక్కలను చూపకుండా దాచిపెడుతున్నారు. కార్పొరేషన్ల బ్యాలెన్స్ షీట్లను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని యనమల డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి బహిరంగ చర్చకు హాజరై ప్రజలకు వాస్తవాలు తెలపాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవహారాల్లో లంచాలు తగ్గాయని ముఖ్యమంత్రి చెప్పటం పెద్ద జోక్‌గా పేర్కొంటూ, ఇది చరిత్రలో నిలిచిపోతుందని ఎద్దేవా చేశారు. మద్యం, ఇసుక వ్యవహారాలలో డిజిటల్ చెల్లింపులకు అనుమతి లేకుండా, కేవలం నగదు లావాదేవీలను మాత్రమే ఎందుకు నిర్వహిస్తున్నారో చెప్పాలన్నారు. 175 సీట్లు వస్తాయంటూ ముఖ్యమంత్రి పగటి కలలు కంటున్నారనీ, 2024 ఎన్నికల్లో సింగిల్ డిజిట్ కు పడిపోవడం ఖాయమని యనమల హెచ్చరించారు.

సమాజమార్పునకు సాహిత్యం సాధనం

డొక్కా మాణిక్య వరప్రసాద్

విశాలాంధ్ర-గుంటూరు : సమాజ మార్పు నకు సాహిత్యం ఒక పనిముట్టుగా పనిచేయాలని తన సాహిత్య రచనల ద్వారా కేంద్ర సాహిత్య అకాడమీ గుర్తింపు పొందిన డాక్టర్ పాపినేని శివశంకర్ సాహిత్య తత్వవేత్తగా రాణిస్తున్నారని శాసనమండలి సభ్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్వీఆర్ కళాశాల సమావేశ మందిరంలో ప్రసిద్ధ సాహిత్య వేత్త డాక్టర్ పాపినేని శివశంకర్ రచించిన కవిత సంపుటి 'లోయలు-శిఖరాలు', కథా సంపుటి సరళరేఖలు పుస్తకాలను ఆదివారం ఆవిష్కరించారు. సభకు సాహిత్య పరిశోధకులు మోదుగుల రవికృష్ణ అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి, కథకుడు ఎంవీ రామిరెడ్డి 'లోయలు-శిఖరాలు' పుస్తకాన్ని పరి చయం చేస్తూ శివశంకర్ కవికి సమాజమే వస్తువు అనీ, పాఠకులను రంజింప చేస్తూ జాగృతం చేసేలా రచనలు చేస్తున్న విశిష్ట కవి శివశంకర్ అని కొనియాడారు. సహజంగానే రైతు బిడ్డ అయిన పాపినేని తనకు ఇష్టమైన ముగ్గురు వ్యక్తుల పేర్లు చెప్పమంటే ఆ ముగ్గురు రైతులేనని వల్లే వేస్తుంటాడన్నారు. సౌమ్యుడిగా ఉండే శివశంకర్ రచనల్లో ఆర్ద్రత, ఆవేదన, అగ్నిశిఖలు ప్రజ్వరిల్లు తాయన్నారు.

సరళరేఖలు కథా సంపుటిని ప్రముఖ రచయిత్రి ఉమా నూతక్కి విశ్లేషిస్తూ అమరావతి ప్రాంత రైతుల దుస్థితిని రాజకీయాలకతీతంగా కథల ద్వారా తెలియచెప్పారని కొనియాడారు. కష్టజీవుల కన్నీటిని, చెమట స్పర్శను, గ్రామీణ వాతావరణాన్ని, సరళరేఖల కథలు గొప్పగా చాటి చెప్పాయన్నారు. రచయిత డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ, తన గురువు తుమ్మల సీతారామమూర్తి ద్వారా ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ వ్యక్తిగా మానవీయ విలువలతో సాహిత్య సేద్యాన్ని చేసే అవకాశం దక్కటం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. కార్యక్ర మంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, జన చైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణ రెడ్డి, అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షులు రావి రంగారావు, బండ్ల మాధవరావు, డాక్టర్ కోగంటి విజయ్, కళాశాల కరస్పాండెంట్ గద్దె మంగయ్య, రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

జోహార్లు జైనీ మల్లయ్య గుప్త

పల్లవి:
నల్లగొండ తాలుకా భువనగిరి అగ్గిపిడుగు
లక్ష్మ్మ,నారాయణల ముద్దు బిడ్డ- జైనీ మల్లయ్య గుప్తా

స్వాతంత్ర్య సమర యోధ.. తెలంగాణ వీరుడా!
అందుకో మా వందనాలు జైనీ మల్లయ్య గుప్తా

నరమేధం సృష్టించిన రజాకార్ల నెదిరించి
రణ భూమిలో రంకెలేస్తూ.. పోరాటం జేసినోడు
యోధుడు మన కామ్రేడు జైనీ మల్లయ్య గుప్తా
మళ్లి రాని దూరానికి ఎళ్లిన మల్లయ్య గుప్తా
అందుకో మా వందనాలు కామ్రేడా మల్లయ్య గుప్తా

ఎర్ర జెండా ప్రాణమని గుండెలోన దాసుకోని
బందూకు ఎత్తు కోని ముందుండి నడిచినావు
భూస్వాముల గుండెలోన గునపమై నిల్చినావు...
ప్రజల కొరకు జంగ్ నడిపి జైలు అనుభవించినావు

వీరుడా!మల్లయ్య గుప్తా అందుకో మా వందనాలు

ఉర్దు దప్ప తెలుగు లేని నైజాముల రాజ్యంలో
ఆంధ్రమహాసభలతో ప్రజలకు చైతన్యం నింపినావు
దున్నెవాడిదే భూమి నినాదం పల్లె పల్లెకు చాటినావు
భూస్వాముల వద్ద ఉన్న భూమి గుంజి పంచినావు
అందుకో మా వందనాలు కామ్రేడా మల్లయ్య గుప్తా

సామాజిక ఉద్యమాల్లో ముందుండి సాగినావు
దొరల గడీల నుండి విముక్తి కల్పించినావు
దోపిడిక చెల్లదని ప్రజా పోరు జరిపినావు
ఉర్దు భాష ప్రేమికుడా..! సామాజిక, సాహిత్యవేత్త
వీరుడా..! మల్లయ్య గుప్తా విప్లవాల వందనాలు

గ్రామీణ భూస్వామ్య, దొరల దౌర్జన్యాలకు
నిజాముల రాచరీకం నడవదని చాటినావు
అజ్ఞాత వాసంలో ఆకు,అలము తింటివి...
జనం కొరకే నీ జన్మంటివి జెండా కింద కడ వరకుంటివి
నిత్య పోరాట సమర శీలి- లాల్ సలాం మల్లయ్య గుప్తా

మిత్ర మండలి స్థాపించి-శత్రు సేనలనెదిరించి
మల్ల యుద్ధం జేసినావు నైజాముల తరిమినావు
నీ దారిలో మేమంతా ఏకమై సాగుతాము
నీ వీడిన పోరు జెండా ఎత్తి పట్టి పోరుతాము
మా గుండెలో నీ పేరు చిరకాలం ఉంచుతాము
నీ యాదిలో మేమంతా ఉద్యమాలు నడుపుతాము

-జి. చంద్రమోహన్ గౌడ్, 9866510399

సాహితి

మంచి పుస్తకం

మూడు పదుల పుట్టుమచ్చ

ఆర్వీ రామారావ్

'...నా మత విశ్వాసాలు కుట్ర
నా సామూహిక ప్రార్థనా సమావేశాలు కుట్ర
నేను మత్తుగా పడి ఉండటం కుట్ర
నేను మేల్కొనేందుకు ప్రయత్నించడం కుట్ర
నేను నలుగురిలో కలిసి వుండాలనుకోవడం కుట్ర
నా అజ్ఞానం కుట్ర, నా వెనుకబాటుతనం కుట్ర
నేను పెళ్లాడటం కుట్ర, నేను పిల్లల్ని కనడం కుట్ర'

1991లో ఖాదర్ మొహియుద్దీన్ 'పుట్టుమచ్చ' పేరుతో దీర్ఘకవిత రాసినప్పుడు ఇంత నిరాశ ఎందుకు అనిపించింది. సకల పీడితవర్గాలను చైతన్యపరచి అభ్యుదయ పథంలో నడిపించవలసిన వారు బాధ్యత విస్మరిస్తున్నందు వల్లే అస్తిత్వవాదాలు పెరుగుతున్నాయేమో అని భావిస్తున్న రోజులవి.

నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయితే తాను ఈ దేశంలో ఉండలేనని ప్రసిద్ధ కన్నడ రచయిత, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత యు.ఆర్. అనంత మూర్తి అన్నారు. మోదీ ప్రధాని అయిన తరవాత మూడు నెలలకే అనంత మూర్తి మృతి చెందారు. ఆ తరవాత ఆయన జీవించి ఉంటే ఏమయ్యేదో తెలియదు.

'ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితుల గురించి వెల్లడించేందుకు నేనొక ఉదాహరణ ఇవ్వాలనుకుంటున్నా. నాకు ఇద్దరు పిల్లలు. కుమారుడు హార్వర్డ్‌లో చదువుతున్నాడు. కుమార్తె లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి పట్టా పొందింది. ఇక్కడ వాతావరణం సరిగాలేదు కాబట్టే అక్కడే స్థిరపడాలని వారికి సూచించాను'... ఇవి లాలూ ప్రసాద్ యాదవ్ నాయకత్వంలోని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్.జె.డి.) నాయకుడు అబ్దుల్ బారీ సిద్ధీఖీ ఇటీవల అన్న మాటలు. సిద్ధీఖీ వ్యాఖ్యలు భారత్‌లో ముస్లింల దురవస్థను చాటుతున్నాయి. దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. దేశంలో నివసించడం ఆయనకు అంతకష్టంగా ఉంటే, ఇక్కడ పొందే సౌకర్యాలు, సౌలభ్యాలు వదిలేసి పాకిస్తాన్ వెళ్లిపోవాలని బీజేపీ నాయకులు అన్నారు.

దేశ విభజన సమయంలో రేగిన గాయాలు క్రమంగా మానుతాయనుకున్న దశలో బాబ్రీమసీదు వివాదం ముస్లింలను మరీ పరాయివాళ్లను చేసింది. బాబ్రీ విధ్వంసం కాకముందే ఖాదర్ సుదీర్ఘ కవిత పుట్టుమచ్చ రాశారు. ఇప్పటి పరిస్థితిని చూస్తే ఖాదర్ చాలా క్రాంతదర్శిలా కనిపిస్తున్నాడు.

అందుకే...
...పట్టెడన్నం కోసం
పేవ్మెంట్ల మీద పూలమ్ముకుంటాను
పండ్లమ్ముకుంటాను, పల్లీలమ్ముకుంటాను
గొడుగులు బాగుచేస్తుంటాను. గడియారాలు బాగు చేస్తుంటాను
వీధరుగుల మీద దర్జీ పని చేస్తుంటాను
దూదేకుతుంటాను దినం గడుపుకుంటాను
ఏ గొడవల్లేకుండా
బతుకును వెళ్లమార్చాలనుకుంటాను
ఉన్నట్టుండి ఎందుకో మరి
నగరాల నడి వీధుల్లో నా నెత్తురు
తీర్థ స్నానఘట్టమవుతుంది...
...పార్లమెంటు భవనంలో వాలేందుకు
నా నెత్తురు పాదలేపనమవుతుంది' అంటారు ఖాదర్.

మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన మారణకాండ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించనక్కర్లేదు. ఆయన ప్రధానమంత్రి అయిన తరవాత పథకం ప్రకారం అనుసరిస్తున్న విద్వేషపూరిత, ముస్లిం వ్యతిరేక విధానాలు గుజరాత్ మారణకాండకన్నా ఎక్కువ హాని చేస్తున్నాయి. గోరక్ష పేరిట ముస్లింలను హతమార్చడం, దాడులు చేయడం విపరీతంగా పెరిగింది. దేశంలో రెండు రకాలవారు ఉన్నారు. ఒకరు-రాముడి సంతానం (రాంజాదే). రెండు హారాంజాదే (అక్రమ సంతానం) అని గొంతు చించుకునే మోదీ భక్తులకు కొదవే లేదు. అంటే ఈ దేశం కేవలం హిందువులదేనన్న ప్రచారం సంఘ్ పరివార్ చాలా తీవ్రంగా చేస్తోంది. ముస్లింలను పూర్తిగా పరాయివారిని చేసేశారు. ఒక్క ముస్లింకు కూడా ఎన్నికల్లో పోటీ చేయడానికి మోదీ నాయకత్వంలోని బీజేపీ అవకాశమే ఇవ్వడంలేదు. పనిగట్టుకుని ముస్లింలకు విలువ తగ్గుతోంది. ఈ వినాశకర దృశ్యాన్ని ఖాదర్ మూడు దశాబ్దాలకు ముందే

ఊహించారు. కాదు కాదు ముస్లింల అనుభవాన్నే ఖాదర్ కవిత్వీకరించారు. నాడు ఖాదర్ వ్యక్తం చేసిన భయం, నిరాశ, అభద్రతాభావం కేవలం భ్రాంతో అపోహో కాదని నేటి పరిస్థితులు రుజువు చేస్తున్నాయి. ముస్లింలను పరాయివారిగా పరిగణించడం కన్నా అధిక సంఖ్యాకులుగా ఉన్న హిందువుల మెజారిటీ వాదాన్ని సుస్థిరం చేయాలని సంఘ్ పరివార్ ఒక పథకం ప్రకారం అమలు చేస్తోంది. ఈ భయాన్ని వ్యక్తీకరించగలిగినందుకే పుట్టుమచ్చ గొప్ప కవిత అయింది. అంతకుముందూ ముస్లింలు చాలా మంది తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. కాని పుట్టుమచ్చకన్నా ముందు ముస్లింల దుస్థితిని ఇంత శక్తిమంతంగా వ్యక్తీకరించిన దాఖలాలు లేవు.

జిన్నాకు ముందే ద్విజాతి సిద్ధాంతాన్ని హిందూత్వవాదుల కులగురువు సావర్కర్ ప్రతిపాదించిన వాస్తవాన్ని విస్మరించలేం. ముస్లింల మీద వ్యతిరేక భావం నాటుకోవడానికి మత ప్రాతిపదికన దేశ విభజన కారణం కావచ్చు. పాకిస్తాన్ ఏర్పడినంత మాత్రాన అదే తమ దేశం అనుకున్న ముస్లింలు మితిమీరిన సంఖ్యలో ఏమీలేరు. పాకిస్తాన్ వెళ్లి అక్కడ పరిస్థితులతో ఇమడలేక తిరిగి వచ్చిన ప్రముఖులూ ఉన్నారు. అసలు పాకిస్తాన్ వెళ్లిపోవాలన్న ఆలోచనకే తావివ్వకుండా తమ దేశం ఇదేనని ఉండిపోయిన వారు అసంఖ్యాక మంది ఉన్నారు.

పాకిస్తాన్‌లో జన్మించినా ఇక్కడే ఉండి దేశసేవకు అంకితమైన వారూ చాలా మంది ఉన్నారు. వారిలో హిందువులూ... ముస్లింలూ ఉన్నారు. ప్రసిద్ధ భౌతికశాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత సుబ్రహ్మణ్యం చంద్రశేఖర్, ప్రసిద్ధ సంగీత దర్శకుడు ఓ.పి.నయ్యర్ కూడా లాహోర్‌లో జన్మించారు. హరగోవింద్ ఖురానా లాహోర్ కళాశాలలో చదువుకున్నారు. సినీనటుడు దేవానంద్ కూడా అక్కడే చదివారు.

దేశంలో సమాచార సాంకేతికతకు ఆద్యుడు అనుకునే ఫకీర్‌చంద్ కోహ్లీ పెషావర్‌లో జన్మించారు. దేశ విభజన తరవాత పాకిస్తాన్‌కు రావాలని తండ్రి గులాం సర్వర్, బంధువులు ఎంత చెప్పినా ససేమిరా అన్న నటుడు దిలీప్ కుమార్ ఇక్కడే ఉండిపోయారు. ఇండియానే నా మాతృదేశం అని తెగేసి చెప్పారు. ప్రముఖ నటుడు షారుఖ్ ఖాన్ తండ్రి తాజ్ మహమ్మద్ ఖాన్‌తో పాటు ఆయన బంధుమిత్రులు అనేకమంది జిన్నా నాయకత్వంలోని పాకిస్తాన్‌ను భరించలేక భారత్‌కు తిరిగి వచ్చేశారు.

ముస్లింలను ఈసడించుకోవడంలో, వారిని పరాయివారుగానే కాక ఈ దేశానికి శత్రువులుగా భావించే సంఘ్ పరివార్ అభిప్రాయం మారలేదు. ఈ విద్వేషాన్ని మోదీ వీలైనంతమంది హిందువులు నరనరాన జీర్ణించుకునేలా చేస్తున్నారు. హిందూయేతరులను దురాక్రమణదారులుగా కాకపోతే కేవలం అతిథులుగా భావిస్తున్నారు. హిందూ సంస్కృతిని అంగీకరిస్తే తప్ప ముస్లింలు సమానస్థాయి పౌరులు కారని చెప్పడమే సంఘ్ పరివార్ లక్ష్యం. దేశాభివృద్ధి అంటే హిందువుల అభివృద్ధేనన్న ప్రచారం జోరుగా చేస్తున్నారు. ఇది హిందువుల దేశమని నమ్మినవారి చేతుల్లో అధికారం ఉన్నంత కాలం ముస్లింలలో అభద్రతా భావం పెరగడమే కాదు హిందువుల్లోనూ అభద్రత గూడుకట్టుకోక తప్పదు.

ఇప్పటి దాకా దేశంలో వివిధ సందర్భాల్లో చెలరేగిన మత కలహాల్లో చిందిన ముస్లింల రక్తమే ఎక్కువ. '2002లో వారికి గట్టిగా బుద్ధి చెప్పిన తరవాతే గుజరాత్ ప్రశాంతంగా ఉంది. ఆ తరవాత ఒక్కసారి కూడా కర్ఫ్యూ విధించవలసిన అవసరం రాలేదు' అన్న అమిత్ షా ఎక్కడా ముస్లింల పేరెత్తకపోయినా ఆయన ఉద్దేశించినది ముస్లింలనేనన్న టీకాటిప్పణి అవసరమే లేదు.

హిందూత్వవాదుల బెదిరింపులను, పాకిస్తాన్ వెళ్లిపోవాలన్న హెచ్చరికలను భరిస్తున్న ముస్లింలను ఎంత భయకంపితం చేస్తున్నారో ఖాదర్ అప్పుడు చెప్పిన దానికన్నా ఇప్పటి పరిస్థితి మరింత భయానకంగా మారింది. ఈ భయోత్పాతాన్ని ఖాదర్ కవితాత్మకంగా ఒడిసిపట్టారు.

దేశ విభజన రక్తసిక్తమైందే కాదు అత్యంత కిరాతకమైంది. ఈ బాధను భరిస్తున్నది ముస్లింలే. ఖాదర్ పుట్టుమచ్చలో వాస్తవ చిత్రీకరణే ఉంది తప్ప హిందూ ద్వేషం మచ్చుకు కూడా లేదు. 1951 నాటి జనాభా లెక్కల ప్రకారం 72,26,000 మంది ముస్లింలు పాకిస్తాన్ వెళ్తే 72,49,000 మంది హిందువులు పాకిస్తాన్ నుంచి భారత్‌కు వచ్చారని తేలింది.

పాకిస్తాన్ నుంచి వచ్చింది హిందువులు, సిక్కులు మాత్రమే కాదు. దేశంలోని ముస్లింలలో అధిక సంఖ్యాకులు అప్పటికి అసలు పాకిస్తాన్ వెళ్లలేదు. వెళ్లిన ముస్లింలలో వేల మంది తిరిగొచ్చారు. ప్రస్తుత పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అంచనా వేయడానికి 31 ఏళ్ల కిందట ఖాదర్ రాసిన పుట్టుమచ్చ చదవాల్సిందే.

చలి మంట

చెలరేగే చెట్ల కొమ్మల్లోంచి
ఊసులాడే ఆకుల సందుల్లోంచి
ముసిముసిగా నవ్విన కిరణాలు
ఒకింత చూపుల్ని ఒంపుతున్నాయి

కరుణించని చలి కొత్తగా కొరుకుతుంది
నిద్ర నుంచీ లేవనే ఉంటుంది
గాలికి ఎదురీదాలనే ఉంటుంది
చెవుల్లో గాలులు గంతులేస్తున్నాయి

మనసులో తపనలు
మధన పడుతుంటాయి
కాలాలు జారినపుడు
పూల పరిభాషలో వేసుకుంటాను

ఆకాశం రంగులు పులుముకున్నట్లు
కలలప్రపంచంలో రంగులపక్షిలా ఎగురుతాను
పిల్ల కాలువ నీటిలా చలి చలిగా వొణుకుతుంటాను

తెల్లవారు చలిమంట కోసం
ఎండిన ఆకుల కోసం
చూపులు పరితపిస్తుంటాయి.

కాలాలు ఎంతగొప్పవో కదా
మనం ఎలావున్నా
దాని ఉనికిని గుప్పెట్లో వాల్చుతుంది

ఎంత పోడుబారినా హత్తుకొనే చలిమంట పైనే
ఎంత ప్రేమ వరికంకులపై పిచ్చుకలు వాలినట్లు

-గవిడి శ్రీనివాస్, 7019278368

పరిశోధనాత్మక బృహత్ సంకలనం చరితార్థులు-2

"ఇతిహాసపు చీకటికోణం/అట్టడుగున పడి కాన్పించని కథలెన్నో కావాలిప్పుడు"- శ్రీశ్రీ.

ప్రముఖ చారిత్రక పరిశోధకులు సయ్యద్ నజీర్ అహమ్మద్ ఎన్నో గ్రంథాలు పరిశోధించి 1780 నుండి 1947 వరకు బ్రిటీష పోరాటంలో పాల్గొని విస్మృతి పాలైన 155 మంది అజ్ఞాత ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల సంక్షిప్త చరిత్రను సచిత్రంగా ప్రామాణికంగా రూపొందించిన ప్రామాణిక గ్రంథం చరితార్థులు-2. గతంలో చరితార్థులు-1 ప్రచురించి పాఠకులకు అందించాడు. స్వాతంత్ర్య పోరాటంలో



గ్రంథ సమీక్ష

చరితార్థులు-2
సయ్యద్ నజీర్ అహమ్మద్,
ఆంగ్లానువాదం:
బి.వి.కె పూర్ణానందం,
వెల: రూ.1000/-లు.
ప్రతులకు:
అజాద్‌హౌస్ పబ్లికేషన్స్,
ప్లాట్ నెం:సి-2, శ్రీరామ్ ఆర్కేడ్,
అమరావతిరోడ్, ఉండవల్లి-522501,
తాడేపల్లి మండలం, గుంటూరుజిల్లా,
తెలుగు బుక్‌హౌస్ హైదరాబాద్ నుండి
పొందవచ్చును.

పాల్గొన్న రాజులు, రాజప్రముఖులు, సైనిక ప్రముఖులు, సైన్యాధి కారులు, ప్రభుత్వాధికారులు, సాహసోపేతులైన సైనికులు మొదలు సామాన్య ప్రజల చిత్రాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. వీటిలో చాలావరకు అస్పష్టంగా ఉన్నందున ప్రముఖ చిత్రకారులు షేక్ అబ్దుల్లా సహకారంతో చిత్రాలు రూపొందించారు. వీటిలో కొన్ని ఊహా చిత్రాలున్నాయి.

కొందరు చరిత్రకారుల పాక్షిక దృష్టి వల్ల అల్ప సంఖ్యాక వర్గాలైన ముస్లిం స్వాతంత్ర్య పోరాట యోధులను ద్వేష పూరితంగా చిత్రించారు. అపోహల మూలాలు మధ్యయుగ భారతదేశ చరిత్రలోనూ, స్వాతంత్ర్యోద్యమంలోనూ, ముస్లింల జీవన పరిస్థితుల్లోనే ఉన్నాయి. 'ముస్లింలు వేర్పాటువాదులే' అనే అపోహను తొలగించేందుకు కొందరు పరిశోధకులు గణనీయమైన కృషి చేశారు. ప్రత్యేకించి నజీర్ అహమ్మద్ అమేయమైన పరిశోధనా కృషితో జాతీయ స్థాయిలో ఎక్కువ మంది పాఠకులకు విషయాన్ని అందించేందుకు వీలుగా తెలుగు, ఇంగ్లీషు భాషలతో పాటు, ఇతర భాషల్లో కూడా తన గ్రంథాలను ప్రచురించాడు.

తొలి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో హిందువులు, ముస్లింలు భుజం భుజం కలిపి బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాడారు. ఈ పోరాటం బ్రిటీషు వారిని కుదిపివేసింది. అందువల్ల బ్రిటీషు వాళ్లు 'విభజించు పాలించు' సిద్ధాంతాన్ని పెంచి పోషించారు. మతోన్మాదంతో హిందూ మహాసభ, ఆర్.యస్.యస్ ఒకవైపు, ముస్లింలీగ్ మరోవైపు నిలిచాయి. మధ్యయుగపు చరిత్రంతా మత విద్వేషపు పునాదుల మీద రచించారు. హిందూ మహాసభకు చెందిన సావర్కర్ 1924 లో ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. పాకిస్థాన్ అనే పదాన్ని చౌదరీ రహమత్ ఆలీ సృష్టించాడు. ముస్లింలు అధికంగా ఉన్నందున పాకిస్థాన్‌ను విడగొట్టాలన్న తీర్మానాన్ని ముస్లింలీగ్ అధినేత జిన్నా ప్రతిపాదించాడు. 'ముస్లిం లీగ్' కాంగ్రెస్ హిందువుల పార్టీగా పరిగణించినా, అన్నీ మతాల వాళ్లు సమానంగా పాల్గొనే విశాల వేదికగా ఉంది. ఎక్కువ సార్లు కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న మౌలానా అబ్దుల్ కలాం అజాద్ చివరి వరకు దేశ విభజన డిమాండ్‌ను పూర్తిగా వ్యతిరేకించాడు. ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్, బరేల్వి, దేవ్‌బంద్‌లకు చెందిన మౌలానాలు కూడా దేశ విభజనను పూర్తిగా వ్యతిరేకించారు. ఈ విషయాలన్నీ వెలుగులోకి రాకుండా చరిత్రకారులు మభ్యపెట్టడం దురదృష్టం. 1908లో ఆవిర్భవించిన ముస్లింలీగ్ దేశ విభజన వరకు సాగిన ప్రస్థానంలో బ్రిటీషు వారి ప్రమేయం ఉంది.

సయ్యద్ నజీర్ అహమ్మద్ ఎంతో శ్రమించి పరిశోధనాత్మకంగా మాతృభూమి విముక్తి కోసం ప్రాణాలర్పించిన ముస్లిం స్వాతంత్ర్య సమరయోధుల ఛాయాచిత్రాలను, వారి జీవిత విశేషాలను సేకరించి ప్రచురించడం అభినందనీయం. అంకిత భావంతో 2014 లో చరితార్థులు-1 గ్రంథాన్ని ప్రచురించారు. 2014 నుండి 2022 వరకు అవిశ్రాంత పరిశోధనా కృషితో 155 మంది ముస్లిం వీరుల సంక్షిప్త జీవిత రేఖాచిత్రాలను చరితార్థులు-2 లో ప్రచురించాడు. ఎంతోమంది మిత్రుల సహకారంతో ఈ గ్రంథాన్ని రూపొందించానని సవినయంగా పేర్కొన్నాడు. 155 మంది ముస్లిం పోరాటయోధుల్లో 'మౌల్వీ ఇమాంబక్స్ సహబాయి, బేగం అజీజున్ వంటి 20 మంది మహిళా పోరాటయోధులున్నారు. అప్పట్లో మహిళా చైతన్య స్ఫూర్తి ఉండడం గర్వకారణం. ముస్లిం పోరాటయోధుల సంక్షిప్త జీవిత చరిత్రలను సచిత్రంగా సేకరించి ప్రచురించిన నజీర్ అహమ్మద్ అభినందనీయుడు. చరితార్థులు-2 గ్రంథం ప్రతి విద్యాసంస్థలో, ప్రతి గ్రంథాలయంలో ఉండదగిన ప్రామాణిక చారిత్రక గ్రంథం. పాఠకులు విధిగా చదువదగిన గ్రంథం చరితార్థులు-2.

డా॥ పి.వి.సుబ్బారావు, సెల్: 9849177594

తానా నవలల పోటీ- 2023

ఉత్తమ నవలకు 2 లక్షల రూపాయల బహుమతి

ఉత్తర అమెరికా తెలుగు సంఘం- తానా ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే నవలల పోటీని ఈ సంవత్సరం కూడా రెండు లక్షల రూపాయల బహుమతితో కొనసాగించాలని తానా కార్యవర్గం నిర్ణయించింది. 2023 జులై 7,8,9 తేదీలలో ఫిలడెల్ఫియాలో జరగనున్న 23 వ తానా మహాసభల సందర్భంగా తెలుగు సాహిత్యంలోనూ, ప్రపంచ సాహిత్యంలోనూ కలకాలం నిలబడే నవలలను వెతికి తీసుకురావాలనే తానా ప్రయత్నానికి స్పందించి ఈ పోటీలో పాల్గొనవలసిందిగా తెలుగు రచయితలందరికీ విజ్ఞప్తి చేస్తున్నాము.

నిబంధనలు:

నవలలు తెలుగు జీవితాన్ని ప్రతిబింబించాలి. ప్రపంచంలోని ఎక్కడివారయినా ఈ పోటీకి నవలలు పంపించవచ్చు. నవలకు పేజీల పరిమితి లేదు. బహుమతికి ఎన్నిక కాని నవలలను తిప్పిపంపడం సాధ్యం కాదు. కాబట్టి జిరాక్స్ కాపీలు కూడ పంపవచ్చు. నవలలు తమ స్వంతమని, అనువాదాలు, అనుసరణలు కావని, ఇంతకుముందు ఎక్కడా ప్రచురితం కాలేదని, ఎక్కడికీ ప్రచురణకు పంపలేదని, తానా పోటీ ఫలితాలు వచ్చేవరకూ ఏ ప్రచురణకు, పోటీకి పంపబోమని పేర్కొంటూ హామీపత్రాన్ని జతచేయాలి. నవలలు తప్పనిసరిగా స్పష్టమైన చేతిరాతతో కాని, డిటిపి చేసికాని పంపాలి. డిటిపి చేసిన నవలలను 2023tananovel@gmail.com కు పంపవచ్చు.

నవలలపై రచయిత పేరు, చిరునామా ఉండకూడదు. అవన్నీ కవరింగ్ లెటర్‌పై ఉండాలి. నిర్వాహకుల నిర్ణయాలపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. వివాదాలన్నింటినీ అమెరికాలోని మేరీలాండ్ న్యాయపరిధిలో పరిష్కరించుకోవాలి. బహుమతి పొందిన నవల ఉన్నత ప్రమాణాలను అందుకునేటట్లుగా ఉండాలన్నది తానా ఆకాంక్ష. ఆ ప్రమాణాలను అందుకునే నవలలు పోటీకి రాని పక్షంలో బహుమతి ఇవ్వకపోవడం కానీ లేదా పూర్తి బహుమతి తగ్గించడం కానీ, ఒకటి కంటే ఎక్కువ నవలల మధ్య పంచడం కానీ తానా నిర్ణయం ప్రకారం జరుగుతుంది. బహుమతికి ఎన్నికైన నవల మొదటి రెండు ముద్రణలను, ఇతర పారితోషికం ఏమీ లేకుండా ప్రచురించే హక్కు తానాకు ఉంటుంది. 2021 లో బహుమతి పొందినవారు ఈ పోటీలో పాల్గొనరాదు.

రచనలు అందవలసిన ఆఖరు తేదీ: 31 మార్చి 2023.

రచనలు పంపవలసిన చిరునామా:
అక్షర క్రియేటర్స్, ఎజి-2, 'ఏ' బ్లాక్, మాతృశ్రీ అపార్ట్‌మెంట్స్, హైదర్‌గూడ, హైదరాబాద్- 500029.
ఇతర వివరాలకు సంప్రదించండి: ఫోన్స్: 9849310560, 040- 29701939, ఈ-మెయిల్: 2023tananovel@gmail.com

'ఆముక్త మాల్యద - సామాజిక జీవనం' అనే అంశంపై ప్రసంగం

ఈ నెల 26 సోమవారం సాయంత్రం 5-30 గంటలకు విశాఖపట్టణం పౌర గ్రంథాలయంలో రాజాం రచయితల వేదిక అధ్యక్షుడు గార రంగనాథం 'ఆముక్త మాల్యద - సామాజిక జీవనం' అనే అంశంపై ప్రసంగిస్తారు. ఈ గణపతిరాజు ఈశ్వరవర్మ స్మారక సాహిత్య కార్యక్రమానికి డా. దామెర వేంకట సూర్యారావు అధ్యక్షత వహిస్తారు. ముఖ్య అతిథులుగా మోపిదేవి విజయగోపాల్, మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, బుక్కూరు వెంకటరావు, రఘువీర్ హాజరవుతారు.

విశ్వ సాహిత్య లలిత కళావేదిక, విశాఖపట్నం

ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు -2022

కవి మిత్రులకు విజ్ఞప్తి. 35 వ 'ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు-2022' కోసం కవుల నుండి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము. అవార్డు పరిశీలన కోసం 2022 సం॥లో ప్రచురింపబడిన కవితాసంపుటాలను మాత్రమే పంపుకోవాలి. ఎంపికైన అవార్డు విజేతకు రూ.6000/-నగదు, షీల్డ్‌తో సత్కారం ఉంటుంది. కవులు తమ కవితాసంపుటాలను 31.12.2022 తేదీ లోగా నాలుగు ప్రతులు ఈ చిరునామాకు పంపి సహకరించగలరు.

డా. ఉమ్మడిశెట్టి రాధేయ, అవార్డు వ్యవస్థాపకులు
13.1.606.1 షిర్డీ నగర్, రెవిన్యూ కాలనీ, అనంతపురం- 515001, సెల్: 9985171411

చలితో ఉత్తరాది గజగజ

- బీహార్‌లో ఇద్దరి మృతి
- శ్రీనగర్‌లో మైనస్ 5 డిగ్రీలు నమోదు

న్యూఢిల్లీ: ఉత్తరాది రాష్ట్రాలను చలి గాలులు వణికిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతుండటంతో ప్రజలు చలితో వణుకుతున్నారు. అనేక నగరాలను మంచు కప్పివేసింది. దిల్లీ సహా ఉత్తర ప్రాంతాల్లో వరుసగా నాలుగో రోజు ఉదయం కూడా దట్టమైన పొగమంచు కమ్ముకున్నది. జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానా, బీహార్‌తో సహా 11 రాష్ట్రాలు చలిగాలులతో గజగజలాడుతున్నాయి. శ్రీనగర్‌లో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. ఇక్కడ ఉష్ణోగ్రత మైనస్ 5డిగ్రీలకు చేరుకున్నది. పహల్గావ్‌లో మైనస్ 6.4 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రత నమోదైంది. దిల్లీలో పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వ్యక్తులు, వాహనాలు కనిపించక ఇబ్బందులు ఎదురయ్యాయి. మరోవైపు బీహార్‌లో అకాల వర్షాలకు ఇద్దరు చనిపోయారు. భాగల్‌పూర్‌లో ఉష్ణోగ్రత 6 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. చలిగాలుల దృష్ట్యా, బీహార్‌లోని పాఠశాలలకు ఈ నెల 31 వరకు సెలవు ప్రకటించారు. మరోవైపు హరియాణాలోనూ ఉష్ణోగ్రతలు 5.8 డిగ్రీలకు చేరుకున్నాయి. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, బిహార్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, త్రిపురలో వారం రోజుల పాటు రాత్రి, ఉదయం దట్టమైన పొగమంచు ఉండే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ రాష్ట్రాల్లో మరో రెండు రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉన్నది. పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో కొన్ని చోట్ల దట్టమైన పొగమంచు, వర్షం కురిసే అవకాశం ఉన్నది. సోమవారం దిల్లీలో ఉష్ణోగ్రత 4 డిగ్రీలకు పడిపోవచ్చునని వాతావరణ శాఖ తెలిపింది. దిల్లీలో మంచు దట్టంగా కమ్ముకోవడంతో ఉదయం 11 గంటలు దాటినా రోడ్లపై వాహనాలు, ప్రజలు కనిపించలేదు.

బీహార్‌లో చలి తీవ్రతకు ఇద్దరు మృతిచెందారు. మరోవైపు శనివారం సాయంత్రం పాట్నా సహా అనేక జిల్లాల్లో కురిసిన అకాల వర్షం వల్ల చలి మరింత పెరిగింది. పాట్నాతో పాటు రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో పొగమంచు కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. పాట్నాలో విజిబిలిటీ 100 మీటర్లకు తగ్గింది. రానున్న రోజుల్లో వర్షాలు, చలి తీవ్రత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

నలుగురు జవాన్లకు

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

జైసల్మేర్: సిక్కింలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ముగ్గురు జవాన్ల మృతదేహాలకు రాజస్థాన్, హరియాణాలోని వారి గ్రామాలలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. మృతి చెందిన వారిలో సుబేదార్ గుమాన్ సింగ్, లాన్స్ నాయక్ మనోజ్ యాదవ్, జవాను సుఖ రామ్ వరుసగా రాజస్థాన్‌లోని జైసల్మేర్, జుంజును, జోధ్‌పూర్ జిల్లాలకు చెందినవారు కాగా లాన్స్‌నాయక్ సోమ్‌వీర్ సింగ్ హరియాణాకు చెందినవారు. గుమాన్ సింగ్ మృతదేహాన్ని దిల్లీ నుంచి జైసల్మేర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి అలంకరించిన సైనిక ట్రక్కులో జోగా గ్రామానికి తీసుకెళ్లినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో స్థానికులు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చేరుకుని 'గుమాన్‌సింగ్ అమర్ రహే', 'భారత్ మాతాకీ జై' అని నినదించారు. వేలాది మంది ప్రజల సమక్షంలో గ్రామంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. సుఖరామ్ మృతదేహాన్ని సైనిక ట్రక్కులో జోధ్‌పూర్ విమానాశ్రయం నుంచి జిల్లా కేంద్రానికి దాదాపు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖేడపాలోని సావంత్‌కువా గ్రామానికి తరలించారు. గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. లాన్స్ నాయక్ మనోజ్ యాదవ్ మృత దేహాన్ని పచేరి కలానా పోలీస్ స్టేషన్ నుంచి దాదాపు 3 కిలోమీటర్ల మేర మజ్రీ గ్రామానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జుంఝునులో జాతీయ పతకాలతో భారీ ప్రదర్శన జరిగింది. గ్రామంలోని యువకులు యాత్రకు నాయకత్వం వహించారు. సోమ్‌వీర్ మృతదేహానికి హిస్సార్‌లో రాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొని నివాళులర్పించారు. శుక్రవారం ఉత్తర సిక్కింలో ట్రక్ లోయలో పడటంతో అందులో ప్రయాణిస్తున్న 16 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయిన సంగతి విదితమే.

న్యాయమూర్తుల పదవీకాలం పెంపునకు

న్యాయశాఖ విముఖత!

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసును పెంచడం వల్ల పెద్దగా పని తీరు చూపని న్యాయమూర్తుల సేవా సంవత్సరాలు కూడా పొడిగించబడతాయని, అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఇలాంటి డిమాండ్లను లేవనెత్తవచ్చని న్యాయ శాఖ పార్లమెంటరీ కమిటీకి తెలిపింది. అత్యున్నత న్యాయవ్యవస్థ నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకోవడంతోపాటు న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సును పెంచే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు బీజేపీ ఎంపీ, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి సుశీల్ మోదీ నేతృత్వంలోని పర్సనల్ లా అండ్ జస్టిస్ పార్లమెంటరీ కమిటీకి న్యాయశాఖ విభాగం వివరించింది. హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సును పెంచే అవకాశాలతో సహా న్యాయ ప్రక్రియలు, సంస్కరణల వివరాలను తెలియజేసింది. అపరిష్కృతంగా ఉన్న కేసులను తగ్గించడం, న్యాయవ్యవస్థలో పారదర్శకత తీసుకురావడం, న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సును పెంచడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సును పెంచే ప్రతిపాదన లేదని జులైలో న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు పార్లమెంటుకు తెలియజేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు 65 సంవత్సరాల వయస్సులో పదవీ విరమణ చేస్తారు. దేశంలోని 25 హైకోర్టుల న్యాయమూర్తులు 62 సంవత్సరాలకు పదవీ విరమణ చేస్తారు. హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచేందుకు 2010లో 114వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. అయితే, ఇది పార్లమెంటులో పరిశీలనకు తీసుకోలేదు.

గవర్నర్ ప్రశ్నలకు సమాధానం ఇచ్చాం

చత్తీస్‌గఢ్ సీఎం బాఘెల్

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో మొత్తం రిజర్వేషన్లను 76 శాతానికి పెంచేందుకు ఉద్దేశించిన రెండు సవరణ బిల్లులపై గవర్నర్ అనుసూయా ఉయికే లేవనెత్తిన ప్రశ్నలకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చిందని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ ఆదివారంనాడిక్కడ విలేకరులకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తన ప్రశ్నలకు సమాధానాలు సమర్పించిన తర్వాత బిల్లులపై ఆమోదముద్ర వేస్తానని గవర్నర్ చెప్పారని, ఇప్పుడు ఆమె బిల్లులకు ఆమోదం తెలపాలని బాఘెల్ అన్నారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల ప్రవేశాల కోటాకు సంబంధించి రాష్ట్ర అసెంబ్లీ డిసెంబర్ 2న చత్తీస్‌గఢ్ పబ్లిక్ సర్వీస్ (షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతుల రిజర్వేషన్) సవరణ బిల్లు , చత్తీస్‌గఢ్ విద్యా సంస్థల (ప్రవేశాల్లో రిజర్వేషన్) సవరణ బిల్లును ఆమోదించింది. ఈ బిల్లుల ప్రకారం షెడ్యూల్డ్ తెగలకు 32 శాతం, ఇతర వెనుకబడిన తరగతులకు (ఓబీసీ) 27 శాతం, షెడ్యూల్డ్ కులాలకు 13 శాతం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) నాలుగు శాతం కోటా లభిస్తుంది. కాగా బిల్లుల్ని ఆమోదించడానికి కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నుంచి 10 అంశాలపై గవర్నర్ వివరణ కోరారు. దీనిపై బాఘెల్ అడగ్గా... 'ప్రత్యుత్తరం గవర్నర్‌కు పంపడం జరిగింది. రాజ్యాంగంలో అలాంటి ఏర్పాటు లేదు కానీ గవర్నర్ వివిధ శాఖల నుంచి వివరాలను కోరగా వాటికి సమాధానం సమర్పించారు. ఇప్పుడు ఆమె బిల్లులకు తన సమ్మతిని తెలియజేయాలి' అన్నారు. ఇదిలావుండగా, రిజర్వేషన్ బిల్లులపై రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు సమాధానం చెప్పాలని బీజేపీ ఎమ్మెల్యే బ్రిజ్మోహన్ అగర్వాల్ డిమాండ్‌చేశారు. 2012లో రమణ్‌సింగ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల ప్రవేశాల్లో రిజర్వేషన్లు 58 శాతానికి పెంచాలని జారీ చేసిన ఉత్తర్వును ఈ ఏడాది సెప్టెంబర్‌లో చత్తీస్‌గఢ్ హైకోర్టు తోసిపుచ్చడంతో రిజర్వేషన్ల అంశం భగ్గుమంది. రిజర్వేషన్లు 50శాతం కంటే పెరిగితే అది రాజ్యాంగ విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ నిలిచిపోయింది. గిరిజనుల కోటా 32 శాతం నుండి 20 శాతానికి తగ్గడంతో వారు తీవ్ర నిరసన తెలిపారు.

గాలి జనార్ధన రెడ్డి కొత్త పార్టీ

'కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష'

2023 కర్ణాటక ఎన్నికల్లో గంగావతి నుంచి పోటీ

బెంగళూరు: కర్ణాటక మాజీ మంత్రి, మైనింగ్ వ్యాపారి గాలి జనార్ధన రెడ్డి ఆదివారం 'కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష' పేరుతో ఒక కొత్త పార్టీని ప్రకటించారు. దీంతో అక్రమ మైనింగ్ కేసులో నిందితుడిగా ఉన్న సదరు నేత బీజేపీతో తనకున్న రెండు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకున్నారు. బళ్లారి జిల్లా వెలుపలి నుంచి కర్ణాటక ఎన్నికల రాజకీయాలలోకి తిరిగి ప్రవేశించిన ఆయన 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కొప్పల్ జిల్లాలోని గంగావతి నుంచి పోటీ చేస్తానని కూడా ప్రకటించారు. 'నేను ఆ పార్టీకి చెందిన వాడిని కానని, దానితో ఎలాంటి సంబంధం లేదని బీజేపీ నేతలు చెబుతున్నప్పటికీ, నేను ఆ పార్టీకి చెందిన వాడిని అని రాష్ట్రం, ప్రజలు విశ్వసించారు. ఆ నమ్మకం అబద్ధమని తేలింది. కళ్యాణ రాజ్య ప్రగతి పక్షం నా స్వంత ఆలోచనతో, మతం, కులం పేరుతో విభజన రాజకీయాలను వ్యతిరేకించే బసవన్న (12వ శతాబ్దపు సంఘ సంస్కర్త) ఆలోచనతో' అని జనార్ధన రెడ్డి అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పార్టీని నిర్వహించి ప్రజలతో మమేకమవుతామన్నారు. 'జీవితంలో ఇప్పటి వరకు ఏ కొత్త కార్యక్రమాల్లో విఫలం కాలేదు. చిన్నతనంలో గోళీలు ఆడే రోజుల నుంచి ఓటమిని అంగీకరించని వ్యక్తిని. అందుకే కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష పేరుతో ప్రజల ముందుకు వెళుతున్నాను. వారి ఆశీర్వాదాలు లభిస్తాయని విశ్వసిస్తున్నాను. భవిష్యత్తులో కర్ణాటక కళ్యాణ రాజ్యంగా (సంక్షేమ రాష్ట్రం) అవుతుందనడంలో సందేహం లేదు' అని తెలిపారు. కాగా 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు మొలకాల్మూరు అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యంత సన్నిహితుడు, ప్రస్తుత మంత్రి బి.శ్రీరాములుకు ప్రచారం చేసిన తర్వాత మైనింగ్ కుంభకోణంలో తన పాత్రపై సీబీఐ అరెస్టు చేసినప్పటి నుంచి గాలి జనార్ధన రెడ్డి దాదాపు 12 సంవత్సరాలుగా రాజకీయంగా నిష్క్రియంగా ఉన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని పేర్కొంటూ, 'నేను గంగావతిలో ఇల్లు కట్టుకుని, అక్కడ ఎన్నికల జాబితాలో పేరు నమోదు చేసుకున్నాను. అక్కడ నుండి పోటీ చేస్తాను' అని తెలిపారు. కోట్లాది రూపాయల అక్రమ మైనింగ్ కేసులో నిందితుడిగా ఉన్న అతను 2015 నుంచి బెయిల్‌పై బయట ఉన్నారు. కర్ణాటకలోని బళ్లారి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కడపను సందర్శించకుండా నిషేధించడంతో సహా సుప్రీం కోర్టు తన ఆదేశాలలో అనేక షరతులు విధించింది. కాగా తాను రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తానని, పార్టీ మేనిఫెస్టో, ప్రణాళికతో ముందుకు వస్తానని చెప్పారు. 'పది-పదిహేను రోజుల్లో నేను పార్టీ జెండా, గుర్తును ప్రకటిస్తాను, మేనిఫెస్టోకు సంబంధించిన ప్రణాళికలతో, బహుశా కొంతమంది అభ్యర్థులతో కూడా వస్తాను' అని ఆయన చెప్పారు. కొన్నేళ్లుగా తనను పట్టించుకోకుండా బీజేపీ వ్యవహరిస్తున్న తీరుతో రెడ్డి కలత చెందారని, ఆయన కొత్త పార్టీ పెట్టడం వల్ల కొన్ని నియోజకవర్గాల్లో, ముఖ్యంగా బళ్లారి బెల్ట్‌లో కాషాయ పార్టీపై కొంత ప్రభావం ఉండవచ్చని పార్టీ కార్యకర్త ఒకరు తెలిపారు. కర్ణాటకలోని బళ్లారి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో విస్తరించి ఉన్న బళ్లారి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో మైనింగ్ లీజు సరిహద్దు గుర్తులను మార్చడంతోపాటు అక్రమ మైనింగ్‌కు పాల్పడినట్లు ఆయన కంపెనీపై ఆరోపణలు ఉన్నాయి. 1999 లోక్‌సభ ఎన్నికల సమయంలో బళ్లారి నుంచి సోనియా గాంధీపై పోటీ చేసిన దివంగత సుష్మా స్వరాజ్‌కు ప్రచారం చేయడం ద్వారా రెడ్డి తొలిసారిగా రాజకీయ వెలుగులోకి వచ్చారు.

ఆప్ మంత్రి సత్యేందర్‌కు మరో ఎదురు దెబ్బ

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో విచారణ కోసం ఎదురుచూస్తున్న దిల్లీ మంత్రి సత్యేందర్ జైన్‌కి మరో ఎదురుదెబ్బ తగిలింది. కనీసం సందర్శకులు ఆయన్ను కలుసుకునేందుకు కూడా అవకాశంలేకుండా 15 రోజుల పాటు శిక్ష విధించింది. అలాగే ఆయనకు సెల్, టేబుల్, కుర్చీ వంటి అన్ని సౌకర్యాలను తొలగించింది. డిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సుల నేపథ్యంలోనే సత్యేందర్‌పై ఈ చర్యలు తీసుకున్నారు. అప్పటి జైలు అధికారి సందీప్ గోయెల్ కారణంగానే సత్యేందర్ జైల్లో రాజభోగాలు అనుభవించారని విమర్శలు రావడంతో గోయెల్‌పై కూడా కమిటీ శాఖా పరమైన చర్యలను తీసుకున్నట్లు పేర్కొంది. అదీకూడ దిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో ఆప్ బీజేపీని ఓడించిన వారాల తర్వాత జైన్‌పై ఈ చర్యలు తీసు కోవడం గమనార్హం. వాస్తవానికి అవినీతి ఆరోపణలు ఎదుర్కొం టున్న సత్యేం దర్ జైన్ జూన్ నుంచి తీహార్ జైలులోనే ఉన్నారు. ఆయన వరుస సీసీటీవీ వీడియో లీక్‌లతో వార్తల్లో ప్రధానాంశంగా నిలిచిన విషయం తెలిసిందే. జైల్లో ఆయనకు వీఐపీ ట్రీట్‌మెంట్, పసందైన విందు అంటూ బీజేపీ వరుస వీడియోలను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో జైలు అధికారులను సస్పెండ్ చేశారు కూడా. ఆఖరికి ఆయన బెయిల్ తిరస్కరణకు గురవ్వడం తోపాటు మత విశ్వాసాలకు తగ్గట్టుగా ఆహారం తీసుకునేలా అనుమతించమంటూ చేసుకున్న అభ్యర్థన సైతం కోర్టు తిరస్కరించింది.

వాజ్‌పేయికి జాతి నివాళి

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని అతల్ బిహారీ వాజ్‌పేయి 98వ జయంతి సందర్భంగా ఆదివారం సదైవ్ అతల్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా సదైవ్ అతల్ స్మారక చిహ్నం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా వాజ్‌పేయికి అర్పించిన ప్రధాని మోదీ... భారతదేశానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. 90వ దశకంలో కేంద్రంలో వాజ్‌పేయి నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఆయన ఆరేళ్ల పాటు భారత ప్రధానిగా కొనసాగారు. మోదీ ట్వీట్ చేస్తూ, 'అతల్ జీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు. భారతదేశానికి ఆయన చేసిన కృషి మరువలేనిది. ఆయన నాయకత్వం, దృక్పథం లక్షలాది మంది ప్రజలను ప్రేరేపిస్తుంది. స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త మదన్ మోహన్ మాలవీయ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం స్థాపనలో కీలక పాత్ర పోషిం చిన మాలవ్య విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు తన జీవితాన్ని అంకితం చేశారని, ఇందుకు ఎప్పటికీ గుర్తుండిపోతారని ప్రధాని అన్నారు. మాజీ ప్రధాని, బీజేపీ అగ్రనేత అతల్ బిహారీ వాజ్‌పేయి 93 ఏళ్ల వయసులో 2018లో కన్ను మూశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా వాజ్‌పేయికి నివాళులర్పిం చారు. వాజ్‌పేయి దార్శనికత కలిగిన సంస్కర్త అని, ఆయన సర్వతోముఖాభివృద్ధిని వేగవంతం చేశారని సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాళులర్పించారు. దేశంలో అభివృద్ధి, సుపరిపాలనలో మాజీ ప్రధాని కొత్త అధ్యాయాన్ని లిఖించారని ఆయన ట్విట్టర్ పోస్ట్‌లో పేర్కొన్నారు. దేశ నిర్మాణానికి వాజ్‌పేయి చేసిన కృషి మరువలేనిదని ఆయన అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ సామాజిక మాధ్యమంలో వాజ్ పేయికి నివాళి అర్పించారు. చైనా దాడిపై చర్చిం చడానికి షెడ్యూల్ కంటే ముందుగానే పార్లమెంటును సమావేశపరచాలని అభ్యర్థిస్తూ జవహర్‌లాల్ నెహ్రూకు లేఖపై సహ సంతకం చేసినప్పుడు వాజ్‌పేయి మొదటి సారి ఎంపీ అని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ తెలిపారు. ఇప్పుడు ఎంపీలు 'కొనసాగుతున్న చైనా చొర బాట్లపై చర్చించలేరు' అని ఆయన అన్నారు. మాజీ ప్రధాని అతల్ బిహారీ వాజ్‌పేయి డిసెంబర్ 25, 1924లో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జన్మించారు. బీజేపీ అత్యంత ప్రభావవంతమైన నాయకులలో వాజ్‌పేయి ఒకరు.

కనీస మద్దతు ధర కోసం

రోడ్డెక్కిన రైతులు

మధ్యప్రదేశ్‌లో బఠానీ రైతుల నిరసన

జబల్‌పూర్: పచ్చి బఠానీల సాగులో ఉన్న రైతులు తమ ఉత్పత్తులకు తక్కువ ధర లభించడంతో జబల్‌పూర్-భోపాల్ జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. బహిరంగ మార్కెట్‌లో కనీస మద్దతు ధరను నిర్ణయించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధికార ప్రతినిధి రాఘవేంద్ర పటేల్ ఆదివారం మాట్లాడుతూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం జబల్‌పూర్ జిల్లాకు 'ఒక జిల్లా ఒకే ఉత్పత్తి పథకం' కింద పచ్చి బఠానీలను ఎంపిక చేసినందున శనివారం రైతులు చేపట్టిన నిరసన ముఖ్యమైనదని తెలిపారు. జిల్లాలో పచ్చి శనగలు పెద్దఎత్తున సాగవుతున్నా యని, వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నామని అన్నారు. పచ్చి బఠానీలకు బహిరంగ మార్కెట్‌లో కనీస ధరను రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాలని రైతులు కోరుతున్నారు. జిల్లా రైతుల చిరకాల డిమాండ్ పెండింగ్‌లో ఉందన్నారు. కాగా ప్రస్తుతం, అటువంటి నిబంధనలు లేనందున బహిరంగ మార్కెట్‌లో కిలోగ్రాము రేటు తగ్గితే రైతులు పచ్చి బఠానీల ఉత్పత్తిలో నష్టపోతారు. కిలోకు వాస్తవ ఉత్పత్తి ధర కంటే తక్కువగా ఉందని పటేల్ చెప్పారు. స్థానిక మండీల నుంచి కిలో రూ.10 నుంచి రూ.20 వరకు లభిస్తున్నాయని తెలిపారు.

దేశమంతటా ఉత్సాహంగా క్రిస్మస్ వేడుకలు

- చర్చిల్లో సామూహిక ప్రార్థనలు
- ఐక్యంగా... సామరస్యంగా ఉండాలని సందేశాలు

న్యూఢిల్లీ/తిరువనంతపురం: భారతదేశం అంతటా క్రిస్మస్ వేడుకలు అత్యంత ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం దేశవ్యాప్తంగా ప్రజలు క్రిస్మస్ పండుగను జరుపుకున్నారు. క్రైస్తవుల పండుగ అయినప్పటికీ, క్రైస్తవేతరులు కూడా తరచుగా క్రిస్మస్‌ను బహుమతుల మార్పిడితో జరుపుకుంటారు. కేరళలోని క్రైస్తవ సమాజం క్రిస్మస్ వేడుకలను సాంప్రదాయంగా, వైభవంగా, ఉత్సాహంతో జరుపుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చర్చిలలో జరిగిన అర్ధరాత్రి సామూహిక ప్రార్థనలతో పండుగ స్ఫూర్తి ప్రారంభమైంది. ఇక్కడ బిషప్‌లు, పూజారులు తమ తమ సంఘాలకు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. రాష్ట్ర రాజధానిలోని సైరో మలంకర కాథలిక్ చర్చిలోని సెయింట్ మేరీస్ కేథడ్రల్‌లో కార్డినల్ మార్ బసేలియోస్ క్లీమిస్ అర్ధరాత్రి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కొచ్చిలో సైరో మలబార్ క్యాథలిక్ చర్చికి చెందిన కార్డినల్ మార్ జార్జ్ అలంచేరి సేవను నిర్వహించారు. అలంచేరి క్రిస్మస్ సందేశమిస్తూ, మనమందరం ఐక్యంగా, సామరస్యంగా నిలబడాలని అన్నారు. తిరువనంతపురంలోని లాటిన్ క్యాథలిక్ ఆర్చ్‌డియోసెస్ ఆర్చ్ బిషప్ థామస్ జె నెట్టో తన క్రిస్మస్ సందేశంలో విజింజంలో నిర్మాణంలో ఉన్న ఓడరేవుకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన మత్స్యకారుల దుస్థితిని కూడా ప్రస్తావించారు. యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజలు తమ ఇళ్లను ప్రకాశవంతమైన, రంగురంగుల దీపాలు, క్రిస్మస్ చెట్టుతో అలంకరించారు. కోవిడ్-19 మహమ్మారి చాలా వరకు తగ్గుముఖం పట్టడంతో భక్తులు గత రెండేళ్లలా కాకుండా ఎటువంటి పరిమితులు లేకుండా చర్చికి హాజరయ్యారు. అర్ధరాత్రి సామూహిక ప్రార్థనలలో పాల్గొనడానికి, కొవ్వొత్తులను వెలిగించడానికి ఆరాధకులు చర్చిలకు తరలి రావడంతో శనివారం రాత్రి దేశవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం న్యూఢిల్లీలోని సేక్రేడ్ హార్ట్ కేథడ్రల్‌ను సందర్శించి మానవాళి సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. చత్తీస్‌గఢ్‌లోని జష్‌పూర్ కేథడ్రల్ ఆఫ్ అవర్ లేడీ ఆఫ్ రోసరీ వద్ద వేలాది మంది ప్రజలు ప్రార్థనలు చేశారు. సీటింగ్ కెపాసిటీ పరంగా ఆసియాలో రెండవ అతిపెద్ద చర్చిగా ఇది ఉంది. తమిళనాడులో క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గుజరాత్‌లో క్రైస్తవ సమాజ సభ్యులు ప్రార్థనలు చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకునేందుకు చర్చిలకు తరలివచ్చారు. ఒడిశాలోని ఖుర్దా జిల్లాలోని జట్నీకి చెందిన ఎల్.ఈశ్వర్ రావు గాజు సీసాలో యేసుక్రీస్తు చిన్న శిల్పాన్ని రూపొందించారు. రావు 750 ఎంఎల్ బాటిల్ లోపల శిలువతో 4-అంగుళాల ఎత్తు, 2-అంగుళాల వెడల్పు గల యేసుక్రీస్తు శిల్పాన్ని రూపొందించారు. దానిచుట్టూ రెండు క్రిస్మస్ చెట్లు ఉన్నాయి. మెర్రీ క్రిస్మస్ అనే సందేశం ఉంది. ఈశ్వర్ రావు దానికోసం సుద్ద, గాజు, గ్లిట్టర్ పేపర్‌ను ఉపయోగించారు. సూక్ష్మ శిల్పాన్ని రూపొందించడానికి ఆయనకు ఏడు రోజుల సమయం పట్టింది. పశ్చిమ బెంగాల్‌లో క్రిస్మస్ సందర్భంగా కోల్‌కతాలోని మిషనరీస్ ఆఫ్ ఛారిటీకి చెందిన మదర్ హౌస్‌లో ప్రార్థనలు జరిగాయి. ఇక మహారాష్ట్ర రాజధాని ముంబైలో ప్రజలు ఉత్సాహంగా క్రిస్మస్ పండుగను జరుపుకున్నారు. ముంబైలోని మెరైన్ డ్రైవ్‌లతో పాటలు పాడుతూ నృత్యం చేశారు. క్రైస్తవులు సోదరభావాన్ని పెంపొందించడంతోపాటు పేదలకు సహాయం చేయడం ద్వారా ఆనందంగా పండుగను జరుపుకోవాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన సందేశంలో పిలుపునిచ్చారు.

1500 టమాటాలతో శాంటాక్లాజ్...

భువనేశ్వర్: క్రిస్మస్ సందర్భంగా ఒడిశాలోని గోపాల్‌పూరీ బీచ్‌లో టమాటాలతో భారీ శాంతాక్లాజ్‌ను ప్రముఖ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ రూపొందించారు. దాని పక్కకన మెర్రీ క్రిస్మస్ అని రాశారు. ఈ శిల్పం పొడవు 27 అడుగులు కాగా వెడల్పు 60 అడుగులు. దీని కోసం మొత్తం 1,500 కిలోల టమాటోలు వాడారు. ఈ శిల్పంతో ప్రపంచ రికార్డు సృష్టించాలని ఆకాంక్షించారు. శిష్యులతో కలిసి ఈ శిల్పానికి రూపమిచ్చినట్లు పట్నాయక్ తెలిపారు. గతేడాది పూరీ బీచ్‌లో 50 అడుగుల పొడవు, 28 అడుగుల వెడల్పు ఉన్న శాంటాక్లాజ్ బొమ్మ కోసం 5,400 గులాబీలు, ఇతర పూలను ఉపయోగించారు. 17 ఏళ్లుగా ప్రతి క్రిస్మస్‌కు శాంటాక్లాజ్ సైకత శిల్పాలు రూపొందిస్తుంటారు.

అప్రమత్తతే మనకు రక్ష

- కోవిడ్ నిబంధనలు తప్పక పాటించండి
- మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ సూచనలు
- అనేక పరిణామాలతో 2022 స్ఫూర్తినిచ్చింది
- ప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని పొందగలిగిన భారత్

న్యూఢిల్లీ: కోవిడ్ ముప్పు ఉంది కాబట్టి అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించాలని, క్రమంగా చేతులను శుభ్రపర్చుకోవాలని దేశప్రజలకు ప్రధాని మోదీ సూచించారు. ఈ ఏడాదికి చివరి మన్‌కీ బాత్‌తో మాట్లాడుతూ అప్రమత్తంగా ఉండటం వల్ల వైరస్ నుంచి మనల్ని మనం రక్షించుకోగలమని అన్నారు. పండుగలు-సెలువు ఉన్నందున కోవిడ్ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలని, అప్పుడే వినోదానికి ఎటువంటి ఆటంకం కలగబోదని మోదీ తెలిపారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలనూ ఆయన ప్రజలకు అందజేశారు. 'మళ్లీ 2023లో కలుద్దాం. ఈ ఏడాదిలానే వచ్చే సంవత్సరం కూడా భారత్‌కు ఎంతో ప్రత్యేకమైనది. దేశాన్ని కొత్త శిఖరాలకు చేరుద్దాం' అని అన్నారు. భారతదేశం ఎంతో ఉత్సాహంగా 2023లోకి అడుగుపెట్టబోతోందని, 2022 సంవత్సరం గొప్ప విజయాలతో అద్భుతంగా గడిచిందని ప్రధాని అన్నారు. ప్రపంచంలో తనకొక ప్రత్యేక స్థానాన్ని భారత్ సంపాదించుకోగలిగిందని తెలిపారు. మన్ కీ బాత్ మైలురాయిని చేరుకోబోతోందని, 100వ ఎపిసోడ్ కోసం సలసహాలు సూచనలివ్వాలన్నారు. యోగా, ఆయుర్వేదానికి ప్రపంచ ఆదరణను ప్రస్తావిస్తూ ఇటువంటి సంప్రదాయ పద్ధతులను తమ పరిశోధనలను, అధ్యయనాల ద్వారా ముందుకు తీసుకెళ్లాలని టాటా మెమోరియల్ రీసెర్చ్ సెంటర్‌కు సూచించారు. బ్రెస్ట్ క్యాన్సర్ రోగులకు యోగా మంచిదని ఓ అధ్యయనంలో వెల్లడైంది. 2022లో ఎన్నో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయని మోదీ చెప్పారు. ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచిందని, కోవిడ్ వాక్సినేషన్‌లో రికార్డు సాధించిందని, స్వీయసమృద్ధిగా ఆవిర్భవించిందని, దేశీయంగా తయారైన తొలి ఐఎన్ఎస్ విక్రాంత్‌కు స్వాగతం పలికిందని, రక్షణ, అంతరిక్షం, డ్రోన్ల రంగంలో ఘన విజయాలు నమోదు చేసుకుందని, అందుకే ఈ సంవత్సరం మనకు ప్రత్యేకమని మోదీ అన్నారు. దేశ ప్రజల బలానికి, వారి సహకారాన్ని, సంకల్పానికి, గొప్ప విజయాలకు 2022 సంవత్సరం అద్దం పట్టిందన్నారు. ఈ ఏడాది అనేక విధాలుగా స్ఫూర్తినిచ్చిందని చెప్పారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏళ్లు పూర్తి అయి అమృతకాలం మొదలైందన్నారు. కమాన్‌వెల్త్ క్రీడల్లో భారతీయ ఆటగాళ్లు రాణించారంటూ మహిళా హాకీ జట్టు ప్రదర్శనను మోదీ ప్రశంసించారు. 'ఒక భారత్-శ్రేష్ఠ భారత్' స్ఫూర్తితో అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గుజరాత్‌లో మాధవ్ పూర్ మేళ, వారణాసిలో కాశీ-తమిల్ సంగమం వంటివి ప్రస్తావించారు. ఆగస్టులో 'హర్ ఘర్ తిరంగా' ప్రచారంలో భాగంగా త్రివర్ణ జెండాలతో ఆరుకోట్ల మందికిపైగా సెల్ఫీలు దిగారన్నారు. జీ20 అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టడం గర్వకారణమని, ఇవన్నీ 2022లోనే జరిగాయని, 2023 కూడా అద్భుతంగా ఉంటుందని మోదీ ఆకాంక్షించారు.

క్రిస్మస్ వేడుకపై హిందుత్వ దాడి

బలవంతపు మతమార్పిడుల ఆరోపణ - ఉత్తరాఖండ్‌లో ఘటన

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో హిందుత్వ సంఘాల కార్యకర్తలు రెచ్చిపోయారు. సామూహిక మతమార్పిడుల నెపంతో చర్చిలో క్రిస్మస్ వేడుకపై దాడికి తెగబడ్డారు. ఈ ఘటన ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌కు 150కిమీల దూరంలోని పురోలా గ్రామంలో జరిగింది. 'హోప్ అండ్ లైఫ్ సెంటర్'లో ప్రార్థనలకు ముస్సోరిలోని యూనియన్ చర్చి పాస్టర్ హాజరయ్యారు. దీంతో 30 మంది హిందుత్వ కార్యకర్తలు అక్కడికి చేరుకొని ప్రార్థనలు నిలిపివేయాలని బెదిరించారు. బలవంతపు మత మార్పిడులు చేస్తున్నారంటూ దాడికి దిగారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు... పాస్టర్ లాజరస్ కార్నెలియస్, ఆయన భార్య సుష్మా సహా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విడుదల చేశారు. ఇదిలావుంటే, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం మతమార్పిడుల నిరోధక చట్టాన్ని ఇటీవల తీసుకువచ్చింది. ఆ చట్టం కింద పదేళ్ల గరిష్ఠ శిక్ష విధిస్తామని పేర్కొంది. దీంతో హిందుత్వ సంఘాలు రెచ్చిపోయాయి. పురోలాలో సామూహికంగా మతమార్పిళ్లు జరుగుతున్నట్లు హిందుత్వ సంఘాల కార్యకర్తలు ఆరోపణలు చేశారు. నేపాల్ నుంచి ఉత్తరకాశికి వచ్చిన వారిని ప్రలోభపెట్టి మతం మార్చుకునేలా క్రైస్తవ సంఘాలు చేస్తున్నట్లు ఆరోపించాయి. శనివారం ఎస్‌డీఎం కార్యాలయం వద్ద ప్రదర్శననూ నిర్వహించాయి. అయితే గ్రామస్తులపై దాడి ఘటన మీద దర్యాప్తు జరుగుతున్నదని పురోలా ఎస్డీఎం జితేంద్ర కుమార్ అన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోజువారీ కేసులు చెప్పేది లేదన్న చైనా ఎన్‌సీహెచ్

బీజింగ్: కరోనా చైనాలో కోరలు చాచింది. రోజూ వేల కేసులు నమోదవుతున్నాయి. ఇకపై రోజువారీ గణాంకాలు వెల్లడించేది లేదని నేషనల్ హెల్త్ కమిషన్ (ఎన్‌సీహెచ్) ప్రకటించింది. స్పష్టమైన కారణాలు తెలియనప్పటికీ ఆదివారం నుంచి రోజువారీ కరోనా కేసులను ప్రకటించేది లేదని ఎన్‌హెచ్‌సీ తెలిపింది. ఇకపై చైనీస్ సెంటర్ ఫర్ డిసీస్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ఫర్ రెఫరెన్స్ అండ్ రిసెర్చ్ .. కరోనా కేసులను వెల్లడిస్తుందని పేర్కొన్నది. సీడీసీ ఎప్పటినుంచి ఈ సమాచారం అందిస్తున్న విషయాన్ని మాత్రం స్పష్టతలేదు.

ఉద్యోగంలో నుంచి తీసేశారని యజమాని సహా ముగ్గురి హత్య

సూరత్‌లో ఘటన: నిందితుడు, అతని సహచరుడు అరెస్టు

కొనసాగుతున్న సిట్ విచారణ

సూరత్: ఉద్యోగం నుంచి తీసేశారన్న కోపంతో మరొకరితో కలిసి సంస్థ యజమానిని, ఆయన తండ్రిని, మేనమామను హతమార్చాడు. ఈ ఘటన గుజరాత్, సూరత్‌లోని అమ్రోలీ ప్రాంతంలోగల అంజని పారిశ్రామికవాడలోని ఎంబ్రాయిడరీ సంస్థ 'వేదాంత టెక్స్'లో జరిగింది. తన సహచరుడితో కలిసి యజమానితో పాటు మరో ఇద్దరిని నిందితుడు హత్య చేశాడని సూరత్ పోలీసులు తెలిపారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొన్నట్లు చెప్పారు. ఈ కేసులో సిట్ ఏర్పాటు అయినట్లు వెల్లడించారు. 'ఆదివారం ఉదయం నిందితుడు, అతని సహచరుడు కలిసి కంపెనీకి వెళ్లారు. ముందు యజమానిని ఆ తర్వాత ఆయన తండ్రి, మామను హత్య చేశారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారిస్తున్నాం' అని డీసీపీ (జోన్5) హర్షద్ మెహతా అన్నారు. మృతులను కల్పేశ్ ధోలకియా (36), ధంజి ధోలకియా (61), ఘన్‌శ్యామ్ రజోడియా (48)గా గుర్తించినట్లు తెలిపారు. తొలగిత ఉద్యోగికి, సంస్థ యజమానికి మధ్య గొడవ మూడు హత్యలకు దారితీసిందని ఆయనన్నారు. నైట్ షిఫ్ట్‌లో నిద్రపోయిన కారణంగా పది రోజులు కిందట యజమాని తనను విధుల నుంచి తొలగించడంతో ఆయనతో పెద్ద గొడవ పెట్టుకున్నట్లు విచారణలో తెలిసిందని డీసీపీ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడం కోసం సూరత్ పోలీసుల వేర్వేరు బృందాలు శ్రమించాయన్నారు. తన నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగుతోందని చెప్పారు. ఫోరెన్సిక్ బృందం ఆధారాలు సేకరించిందని, వారంలో చార్జిషీటు దాఖలు చేస్తామన్నారు. నిందితుడు ఆన్‌లైన్‌లో కత్తిని కొన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని డీసీపీ మెహతా తెలిపారు.

చర్చీల సర్వేపై అసోం సీఎం దిద్దుబాటు చర్యలు

గువహటి: చర్చీలపై సర్వే నిర్వహించాలని జిల్లాలకు ఆదేశాలను ఎవరు జారీ చేశారో తెలుసుకోవాలని డీజీపీకి అసోం సీఎం హిమంతా బిశ్వశర్మ ఆదేశాలిచ్చారు. చర్చీల వంటి మతపరమైన వ్యవస్థలపై సర్వే నిర్వహించే ఉద్దేశం అసోం ప్రభుత్వానికి లేదన్నారు. చర్చీల సంఖ్యతో పాటు మత మార్పిడులు, బలవంతంగా జరిగే మతమార్పిడులతో ముడిపడి ఉన్న వ్యక్తులపై సమాచారం కోరుతూ జిల్లా యాంత్రాంగాలకు అసోం పోలీసుల ప్రత్యేక శాఖ లేఖ జారీ చేయడంపై ఓ టీవీఛానల్‌తో మాట్లాడిన సందర్భంగా ముఖ్యమంత్రి స్పందించారు. అసోంలో ఎన్ని చర్చీలు ఉన్నాయి వంటి ప్రశ్నలను నివారించడం మంచిదని, లేకపోతే మతపరమైన మనోభావాలు దెబ్బతింటాయని అన్నారు. ఈ లేఖతో తనకు సంబంధం లేదని, ప్రభుత్వ ఫోరంలో ఈ విషయంలో ఎన్నడూ చర్చ రాలేదన్నారు. 'ఇది అనవసరమైన లేఖ. అసోం పౌరునిగా అన్ని వర్గాల మధ్య శాంతి, సామరస్యాన్ని కోరుకుంటున్నా' అని బిశ్వశర్మ అన్నారు. ఈ లేఖను జారీ చేసినది డీజీపీనా లేక హోంశాఖ అన్నది తెలియాల్సి ఉన్నట్లు తెలిపారు. దీనిపై ఆరా తీయాలని డీజీపీకి సూచించానని, ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని కూడా చెప్పానన్నారు. మతమార్పిళ్ల కట్టడికి అసోంలో చట్టం లేదని, అలాంటివి జరిగితే పోలీసు చర్య ఉండదని చెబుతూనే ఇష్టాప్రకారం-బలవంతంగా జరిగే మతమార్పిడుల మధ్య తేడా ఉంటుందని సీఎం అన్నారు.

యూనివర్సిటీ విద్య నిషేధంపై అఫ్గాన్‌లో నిరసన

కాబూల్: అఫ్గానిస్థాన్‌లో తాలిబన్ ప్రభుత్వం కఠిన నిర్ణయాలను వరుసగా తీసుకుంటూ బాలికల విద్యపై పూర్తిస్థాయిలో ఉక్కుపాదం మోపింది. విద్య, స్వేచ్ఛ వంటివి కనీస హక్కుల్ని అమ్మాయిలకు దూరం చేస్తోంది. యూనివర్సిటీల్లో చదువుకోవడంపై నిషేధం ఇటీవల విధించింది. దాంతో చాలామంది మహిళలు ఆ నిరసన గళం వినిపించారు. మర్వా అనే 19 ఏళ్ల అమ్మాయి తన ఆక్రోషాన్ని వెళ్లగక్కింది. కాబూల్‌లోని తన ఇంటి నుంచి అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడుతూ.. 'యూనివర్సిటీ విద్యపై నిషేధం బదులు ఆడవాళ్ల తల తీసేయండని వాళ్లు ఆదేశాలు ఇస్తే బాగుండేది. ఒకవేళ మాకు చదువుకునే హక్కు లేకుంటే.. మేము అసలు పుట్టకపోయి ఉంటే బాగుండేదని కోరుకుంటా. ఇంకా ప్రాణాలతో ఉన్నందుకు బాధపడుతున్నా. మమ్మల్ని జంతువుల కంటే హీనంగా చూస్తున్నారు. మా దేశంలోని అమ్మాయిలకు ఇంటి నుంచి బయటకు వచ్చే హక్కు కూడా లేదు ' అని ఆమె తన బాధను వెల్లడించింది. వాళ్ల కుటుంబంలో యూనివర్సిటీ చదువు వరకు వచ్చిన మొదటితరం అమ్మాయి తానే కాగా ఈమధ్యే మెడికల్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించింది. మరికొన్ని నెలల్లో కాబూల్ యూనివర్సిటీలో నర్సింగ్ డిగ్రీలో చేరి బాగా చదువుకొని ఉద్యోగం చేయాలనుకున్నది. కానీ ఆమె కలలన్నీ కల్లలయ్యాయి. తాలిబాన్ల నిర్ణయాన్ని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. అలా చేయడం ఇస్లాంకు వ్యతిరేకమని కొన్ని ముస్లిం దేశాలు అభిప్రాయపడ్డాయి.

ఆగ్రాలో కోవిడ్ కలకలం

చైనా నుంచి వచ్చిన వ్యక్తికి పాజిటివ్: సీఎంఓ అరుణ్ శ్రీవాత్సవ

ఆగ్రా: ఆగ్రాలో కోవిడ్ కేసు నమోదైంది. చైనా నుంచి రెండు రోజుల కిందట వచ్చిన వ్యక్తిలో వ్యాధి లక్షణాలను గుర్తించారు. 40ఏళ్ల వ్యక్తికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో ఆయనను హోంఐసోలేషన్‌లో ఉంచినట్లు ప్రధాన వైద్యాధికారి అరుణ్ శ్రీవాత్సవ ఆదివారం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహించాలని ఆరోగ్య శాఖ బృందాలకు సూచించామన్నారు. రోగి నమూనాలను సేకరించి జినోమ్ సీక్వెన్సింగ్ కోసం లక్నోకు పంపినట్లు చెప్పారు. చైనా నుంచి దిల్లీ మీదగా ఈనెల 23న ఆగ్రాకు వచ్చిన ఈయన ప్రైవేటు ల్యాబ్‌లో పరీక్ష చేయించగా కోవిడ్ సోకినట్లు తేలిందని శ్రీవాత్సవ తెలిపారు. నవంబరు 25 తర్వాత జిల్లాలో ఇదే మొదటి కేసు అని అధికారులు అన్నారు. ఇప్పటికే తాజ్‌మహల్, ఆగ్రా ఫోర్ట్, అక్బర్ సమాధి వద్ద విదేశీ సందర్శకులకు స్క్రీనింగ్, టెస్టింగ్‌ను ఆగ్రా ఆరోగ్యశాఖ తప్పనిసరి చేసింది. ఆగ్రా విమానాశ్రయం, రైల్వేస్టేషన్, బస్ టర్మినల్ (ఐఎస్‌బీటీ) వద్ద ప్రయాణికుల నమూనాల సేకరణ జరుగుతోంది. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని జిల్లా ప్రజలకు సూచనలు చేసినట్లు శ్రీవాత్సవ వెల్లడించారు.

సినీ పరిశ్రమలో విషాదం

హైదరాబాద్: విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తెలుగు ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ప్రముఖ సీనియర్ నటుడు చలపతి రావు మృతితో సినీ పరిశ్రమలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఆయన మృతికి సినీ పరిశ్రమకు చెందిన నటులు, నిర్మాతలు, దర్శకులు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేశారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సీనియర్ నటుడు చలపతిరావు పార్థివదేహానికి మెగాస్టర్ చిరంజీవి, నిర్మాత సురేష్ బాబు, నటుడు కాశీ విశ్వనాథ్, డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, నందమూరి రామకృష్ణ, హీరో తరుణ్ తదితరులు నివాళులర్పించారు. ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేసీఆర్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రెండు రాష్ట్రాలకు చెందిన అనేకమంది అనేకమంది మంత్రులు, ప్రజాప్రతినిధులు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఇంకా అనేకమంది సినీ రాజకీయ ప్రముఖులు చలపతిరావు మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

నాకు మంచి మిత్రుడు: చిరంజీవి

నటుడు చలపతిరావు తనకు మంచి మిత్రుడు. మద్రాసులో ఉన్ననాటి నుంచి తనకు ఆయనతో మంచి అనుబంధం ఉంది. చాలా ఆరోగ్యంగా ఉంటారు. కానీ ఇలా ఆకస్మికంగా మరణించడం కలచివేసింది. చలపతిరావు భౌతికకాయానికి చిరంజీవి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మా కుటుంబ సభ్యుల్లో ఒకరు: బాలకృష్ణ

చలపతిరావు గారి హఠాన్మరణం తీవ్రంగా కలిచివేసింది. మా కుటుంసభ్యుల్లో ఒకరుగా భావించే ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటున్నా. తెలుగు చలన చిత్ర పరిశ్రమ మంచి నటుడిని కోల్పోయింది. చలపతిరావు గారికి మా కుటుంబంతో అవినాభావ సంబంధం ఉంది. ఆయన నాన్నగారితో కలిసి అనేక సినిమాల్లో నటించారు. నా సినిమాల్లో కూడా మంచి పాత్రలు పోషించారు. ఆయన కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానూభూతి తెలియజేస్తున్నా.

నవ్వుతూ...నవ్విస్తూ ఉండేవారు: భానుచందర్

చలపతిరావు గారు చాలా గొప్ప మనిషి. ఆయన ఎప్పుడు నవ్వుతూ.. నవ్విస్తూ ఉండేవారు అన్నారు భానుచందర్. ఆయన మరో నటుడు భర్తీ చేయలేరు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి.

నిజజీవితంలో ఎంతో మంచి మనిషి: తరుణ్

ఒక గొప్ప నటుడిని కోల్పోయాము.ఆయన ఎంతో మంచి వారు... సినిమాల్లో విలన్ పాత్రలు చేసినా నిజజీవితంలో ఎంతో మంచి మనిషి. చాలా సరదాగా ఉంటారు. నా మొదటి సినిమాలోనే కలిసి నటించా. ఆయన మరణం కలిచివేసింది.

ఆ సమయంలో చాలా ఏడ్చేశారు: కరాటే కళ్యాణి

చలపతి రావు గారి మరణం కలిచివేసింది. మా ఎలక్షన్స్ సమయంలో వీల్ చైర్ పై వచ్చి ఓటు వేశారు. మళ్లీ వస్తానో రానో మిమ్మల్ని కలుస్తానో లేదో అంటూ ఏడ్చేశారు.

చలపతిరావు ప్రేమకథనే సినిమాగా...

ఈవీవీ తీసిన 'మా నాన్నకు పెళ్లి' సినిమా కథ నా లవ్ స్టోరీనే అంటూ గతంలో అలీతో సరదాగా షోలో చలపతిరావు తెలిపారు. తన ప్రేమ, పెళ్లి విషయాలనే ఆధారంగా చేసుకుని ఆ సినిమాను రూపొందించారని తెలిపారు.

నిజ జీవితంలో విషాదం...అగ్ని ప్రమాదంలో చనిపోయిన భార్య

55 ఏళ్ల సుదీర్ఘ సినీ ప్రయాణంలో ప్రేక్షకులను ఎంతో అలరించిన చలపతిరావు నిజ జీవితంలో ఎంతో విషాదం ఉంది. కొడుకు, ఇద్దరు కుమార్తెలు పుట్టిన తర్వాత ఆయన భార్య ఇందుమతి అగ్ని ప్రమాదంలో చనిపోయారు. చెన్నైలో ఉన్నప్పుడు ఈ దుర్ఘటన జరిగింది. తెల్లవారు జామున మంచినీళ్లు పట్టేందుకు వెళ్లినప్పుడు ఆమె చీరకు నిప్పంటుకుంది. ఆమె అరుపులు విన్న చలపతిరావు మంటలార్పారు. మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఆమె మృతి చెందారు. ఆ తర్వాత చలపతిరావు రెండో పెళ్లి చేసుకోలేదు. తన ముగ్గురు పిల్లలకే జీవితం మొత్తాన్ని కేటాయించారు.

మా నాన్న ప్రశాంతంగా కన్నుమూశారు

నటుడు, దర్శకుడు రవిబాబు

హైదరాబాద్: తన తండ్రి, ప్రముఖ నటుడు చలపతి రావు చాలా ప్రశాంతంగా కన్నుమూశారని నటుడు, దర్శకుడు రవిబాబు తెలిపారు. 'నిన్న రాత్రి నాన్నగారు కన్నుమూశారు. ఆయన జీవితంలో ఎలా హ్యాపీగా ఉన్నారో, అందరినీ ఎలా నవ్విస్తూ ఉండేవారో అలానే ప్రశాంతంగా వెళ్లిపోయారు. భోజనం చేసి, చికెన్ కూర, చికెన్ బిర్యాని తిన్నారు. ఆ ప్లేట్ ను ఇచ్చి వెనక్కి వాలిపోయారు. అంత సింపుల్ గా, హ్యాపీగా వెళ్లిపోయారు. ఈ రోజే అంత్యక్రియలు నిర్వహిద్దామనుకున్నాం. కానీ, మా సిస్టర్స్ అమెరికాలో ఉన్నారు. వాళ్లు రావడానికి టైం పడుతుంది. మంగళవారం మంచి రోజు కాదు కాబట్టి బుధవారం నిర్వహిస్తాం' అని మీడియాతో చెప్పారు. ఇండస్ట్రీలో తన తండ్రి ఎంతో మందికి సాయం చేశారని, ఆ విషయం కుటుంబంలో ఎవ్వరికీ తెలిసేది కాదన్నారు. తాను పరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాతనే ఆయన ఎలాంటి వారో పూర్తిగా అర్థం అయ్యిందన్నారు. 'మా నాన్న గురించి నాకంటే మీ అందరికే ఎక్కువ తెలుసు. ఆయన ఎలాంటి వ్యక్తి, ఇండస్ట్రీలో ఎలా ఉంటారనే విషయం చిన్నప్పుడు నాకు తెలియదు. కానీ, నేను ఇండస్ట్రీకి వచ్చిన తర్వాతే తెలిసింది. అందరూ ఆయన గురించి గొప్పగా చెప్పేవారు. ఎంతో మందికి సాయం చేశారని తెలిసింది. ఈ విషయాలు మాకు తెలిసేవి కాదు. మా నాన్నకు రామారావు గారు, ఆహారం, హాస్యం ఈ మూడే చాలా ఇష్టం. ఎప్పుడూ అందరినీ నవ్విస్తూ ఉండేవారు. అలానే ఇప్పుడు ఒక్క క్షణంలో ఎలాంటి బాధ లేకుండా ఈ లోకాన్ని విడిచివెళ్లిపోయారు. అలాంటి వ్యక్తికి శత్రువులు ఎవ్వరూ ఉండరు. నా కొత్త సినిమాలో ఆయన చివరగా నటించారు. ఐదు రోజుల క్రితమే షూటింగ్ లో పాల్గొన్నారు. అదే ఆయనకు చివరి చిత్రం' అని రవిబాబు వెల్లడించారు.

కన్నీటిపర్యంతమైన తారక్ : సీనియర్ నటుడు చలపతిరావు హఠాన్మరణం పట్ల హీరో జూనియర్ ఎన్టీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన అక్కడి నుంచి చలపతిరావు కుమారుడు రవిబాబుకు వీడియో కాల్ చేసి మాట్లాడారు. మీరు మరణించారనే వార్త జీర్ణిం చుకోలేకపోతున్నామని.. బాబాయ్ లే అంటూ భావోద్వేగానికి గురయ్యారు.

బంగ్లాతో టెస్ట్ సిరీస్ క్లీన్‌స్వీప్

రెండో టెస్టులో చెమటోడ్చి నెగ్గిన టీమిండియా

ఆదుకున్న అశ్విన్, అయ్యర్

మిర్పూర్: బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను టీమిండియా క్వీన్‌స్వీప్ చేసింది. మిర్పూర్‌లో ఆదివారం ముగిసిన రెండో టెస్టులో మూడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అయితే బంగ్లాదేశ్ నిర్దేశించిన 145 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో టీమిండియా చెమటోడ్చాల్సి వచ్చింది. మ్యాచ్ నాలుగో రోజు విజయానికి 100 పరుగులు చేయాల్సిన స్థితిలో 4/45 ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ కొనసాగించిన టీమిండియా, జట్టు స్కోరు 56 పరుగుల వద్ద ఉనద్కత్ వికెట్‌ను కోల్పో యింది. కాసేపటికే రిషబ్ పంత్, అక్షర్ పటేల్ కూడా అవుట్ కావడంతో ఫలితంపై ఉత్కంఠ ఏర్పడింది. 74 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన దశలో అశ్విన్, శ్రేయస్ అయ్యర్ ఆదుకున్నారు. మరో వికెట్ కోల్పోకుండా జట్టును విజయ తీరాలకు చేర్చారు. అశ్విన్ 42, అయ్యర్ 29 పరుగులతో అజేయంగా నిలిచారు. నాలుగో రోజు ఆటలో ప్రతి క్షణం ఉత్కం ఠభరితమే. ప్రతి బంతి వికెట్ తీసేలా దూసుకొచ్చింది. తొలి గంటలోనే మూడు వికెట్లు సమర్పిం చుకోవాల్సి వచ్చింది. దీంతో ఒక దశలో ఓటమి ఖాయమేమో అన్నట్లుగా భారత అభిమానుల్లో టెన్షన్ పెరిగిపోయింది. అయితే చివరికి అశ్విన్, శ్రేయస్ ఓపిగ్గా ఆడి బంగ్లాను ఓడించి సిరీస్‌ను భారత్ సొంతం చేశారు. ప్రారంభంలో రిషభ్ పంత్ దూకుడుగా ఆడేం దుకు ప్రయత్నించాడు. అయితే కొత్త బంతి కావడంతో షాట్లు కొట్టేం దుకు బ్యాటర్లకు అవకాశం దక్కలేదు. బంతి పాతబడిన తర్వాత శ్రేయస్, అశ్విన్ బంగ్లా బౌలింగ్‌పై ఎదురు దాడి చేశారు. దీంతో అప్పటి వరకు అద్భుతంగా బౌలింగ్ చేసిన బంగ్లా బౌలర్లు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. బంగ్లా బౌలర్లలో హసన్ మీర్జా 5 వికెట్లతో టీమిండియా బ్యాటర్లను వణికించాడు. షకీబ్ 2 వికెట్లు తీశాడు. టాప్‌ఆర్డర్లు బ్యాటర్లు చాప చుట్టేసినా అశ్విన్, అయ్యర్ పట్టుదలగా ఆడి జట్టును గెలిపించారు. రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 227 పరుగులకు ఆలౌటైంది. భారత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 314 పరుగులు చేసి 87 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. కాగా రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 231 పరుగులకు ఆలౌటైంది. టీమిండియా ఏడు వికెట్లు కోల్పో యి 145 పరుగుల లక్ష్యాన్ని ఛేధించింది.

ఇదేం బ్యాటింగ్ ?

ప్రత్యర్థి బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేస్తున్నప్పుడు భారత బ్యాటర్లు అనవసరంగా ముందుకొచ్చి వికెట్లు ఇవ్వడం దారుణం. భారత ఇన్నింగ్స్‌లో ఛతేశ్వర్ పుజారా, శు భ్‌మన్ గిల్ స్వీయ తప్పిదాలతో పెవిలియన్ చేరారు. ఇక షరా మామూలుగా కెప్టెన్ కేఎల్ రాహుల్ చేతులెత్తేశాడు. ఎంతో ఓపిగ్గా ఆడిన విరాట్ కోహ్లీ కూడా ఔటయ్యా డు. బంగ్లా స్పిన్ బౌలింగ్లో మరీ ఆత్మరక్షణ ధోరణితో బ్యాటింగ్ చేయడం వల్లే ఇలా వికెట్లనుట్ల కోల్పోవాల్సి వచ్చిందనే వాదనా ఉంది.

టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆశలు సజీవం



బంగ్లా పర్యటనలో రెండు టెస్టులను గెలవడంతో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ పట్టికలో టీమిండియా ద్వితీయ స్థానంలో కొనసాగుతోంది. ఈ పట్టికలో ఆస్ట్రేలియా 76.92 విజయ శాతంతో అగ్రస్థానంలో ఉంది. ఇక భారత్ 58.93 శాతంతో 99 పాయింట్లు సాధించి రెండోస్థానంలో కొనసాగుతోంది. సోమవారం నుంచి మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాతో ద్వితీయ టెస్టు ఆడనున్న దక్షిణాఫ్రికా 54.55 శాతంతో ఈ టేబుల్లో మూడో స్థానం దక్కించుకుంది. ఆ తర్వాత శ్రీలంక, ఇంగ్లాండ్, వెస్టిండీస్, పాకిస్తాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ జట్లు ఉన్నాయి. తాజా విజయంతో భారత్‌కు టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లోకి అడుగుపెట్టేందుకు అవకాశాలు మెరుగయ్యాయి. ఈ విషయంలో దక్షిణాఫ్రికా నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటోంది. భారత్ ఒకవేళ స్వదేశంలో జరిగే ఆస్ట్రేలియా సిరీస్‌లో 4-0 తేడాతో విజయం సాధిస్తే 68.05 విజయ శాతం లభిస్తుం ది. అప్పుడు దక్షిణాఫ్రికా మిగిలిన నాలుగు టెస్టులను గెలిచినా కూడా కేవలం 66.66 శాతమే ఉంటుంది. ఫైనల్స్‌కు అవకాశం రాదు. ఇక భారత్ 3-0తో సిరీస్‌ను సాధిస్తే మాత్రం 64.35 పాయింట్లకు చేరుతుంది. అప్పుడు దక్షిణాఫ్రికా తన నాలుగు టెస్టుల్లో విజయం సాధిస్తేనే ఫైనల్స్‌కు అడుగుపెడుతుంది. ఇక మిగిలిన జట్లకు ఫైనల్స్‌కు చేరేందుకు మార్గాలు దాదాపు మూసుకు పోయాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.